RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

మేడ్చల్ మల్కాజ్గిరి | సంపుటి : 2 సంచిక : 107 | ఆదివారం, మే 26, 2024 | పేజీలు : 4

## కేటీఆర్ దిష్టి బొమ్మ దహనం

**హైదరాబాద్:** యూనివర్సిటీ విద్యార్థిని పల్లి బఠాణీలు అమ్ముకునే వ్యక్తిగా కించపరించిన మాజీ మంత్రి కేటీఆర్ క్షమాపణ చెప్పాలని నిరుద్యోగ జేఏసీ ఛైర్మెన్ మానవత రాయ్ డిమాండ్ చేశారు. కేటీఆర్ వ్యాఖ్యలను నిరసిస్తూ ఉస్మానియా యూనివర్సిటీ లో కేటీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిట్స్ పిలాని లో చదువుకున్న వారు ప్రజలకు సేవ చేసే రాజకీయాల లో ఎవరు లేరని, ఉస్మానియా యూనివర్సిటీ లో చదువుకున్న పివి నరసింహ రావు, జైపాల్ రెడ్డి లాంటి ఎంతో మంది రాజకీయ పదువులలో ఉండి ప్రజలకు సేవ చేశారని గుర్తుచేశారు.

### మెడికల్ కాలేజీల్లో కన్వీనర్ కోటా సీట్లు...

## 100 శాతం తెలంగాణ విద్యార్థులకే దక్కాలి

హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్రం అవతరించి పదేళ్లు పూర్తి అవుతున్న నేపథ్యంలో వైద్య విద్య ప్రవేశాలకు సంబంధించి స్థానికత అంశంపై స్పష్టత ఇవ్వడంతో పాటు, మెడికల్ కాలేజీల్లో కన్వీనర్ కోట సీట్లు 100 శాతం సీట్లు తెలంగాణ విద్యార్థులకు దక్కేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని మాజీ వైద్యారోగ్య శాఖ మంత్రి, సిద్ధిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు డిమాండ్ చేశారు. జూన్ మూడో వారంలో అడ్మిషన్ల ప్రక్రియ మొదలవుతున్న క్రమంలో ప్రభుత్వం తక్షణం స్పందించి స్పష్టత ఇచ్చేలా ఉత్తర్వులు జారీ చేయాలి. లేదంటే వైద్య విద్య చదివే అవకాశాలను తెలంగాణ విద్యార్థులు తీవ్రంగా కోల్పోతారు అని హరీశ్‌రావు పేర్కొన్నారు. తెలంగాణ ఏర్పాటుకు ముందున్న 20 మెడికల్ కాలేజీల్లోని 2,850 సీట్లలో కాంపిటెంట్ అథారిటీ కోటా కింద 1,900 సీట్లు ఉన్నాయి. ఇందులో 15 శాతం అన్ రిజర్వుడు కోటా అంటే 280 సీట్లు తెలంగాణ విద్యార్థులు కోల్పోతారు. దీంతోపాటు నిమ్స్ సహా ఇతర మెడికల్ కాలేజీల్లోని దాదాపు 150 పీజీ సీట్లు కోల్పోతారు అని హరీశ్‌రావు వెల్లడించారు. ఎంబీబీఎస్/పీజీ అడ్మిషన్ల ప్రక్రియ సమీపిస్తున్నప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ముఖ్యమైన విషయాలను పట్టించుకోకుండా నిర్లక్ష్యం ప్రదర్శిస్తుండటం దురదృష్టకరం. తెలంగాణ విద్యార్థుల ప్రయోజనాలు కాపాడడంలో కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యం చెందుతున్నది. ప్రభుత్వ తీరుతో తల్లిదండ్రులు,



విద్యార్థులు తీవ్రంగా ఆందోళన చెందుతున్నారు. రాష్ట్ర పునర్విభజన చట్టం మేరకు 2014 నుండి కన్వీనర్ కోటాలో 15 శాతం సీట్లకు తెలంగాణతో పాటు, ఆంధ్రప్రదేశ్ విద్యార్థులు సైతం పోటీపడే వెసులుబాటు కల్పించారు. ఇదే విధానం కొనసాగితే, 2014 తర్వాత ఏర్పాటు చేసిన కొత్త మెడికల్ కాలేజీల్లో కూడా 15 శాతం అన్ రిజర్వుడు కోటా అమలు చేయాల్సి ఉంటుంది. దీని వల్ల దాదాపు 520 సీట్లు తెలంగాణ విద్యార్థులు కోల్పోవాల్సి వస్తుంది. దీన్ని నివారించేందుకు గాను తెలంగాణ ప్రభుత్వం, అన్ రిజర్వుడు కోటాను కేవలం పాత 20 మెడికల్ కాలేజీలకు మాత్రమే పరిమితం చేసిందని హరీశ్‌రావు తెలిపారు. దీనికోసం ఏపీ రీఆర్గనైజషన్ ఆక్ట్, ఆర్టికల్ 371D నిబంధనలకు లోబడి తెలంగాణ స్టేట్ మెడికల్/డెంటల్ కాలేజెస్ అడ్మిషన్ రూల్స్‌కు సవరణ చేస్తూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

### జాబ్ క్యాలెండర్ పెద్ద మోసం..


## 2 లక్షల ఉద్యోగాల ఊసే లేదు

హైదరాబాద్ : జాబ్ క్యాలెండర్ పేరిట కాంగ్రెస్ పార్టీ నిరుద్యోగులను మోసం చేసిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నిప్పులు చెరిగారు. ప్రభుత్వం ఏర్పడిన వెంటనే మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేస్తామన్నారు. ఏడాదికి 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామన్నారు. ఇప్పటి వరకు ఒక్క నోటిఫికేషన్ కూడా రాలేదు అని కేటీఆర్ తెలిపారు. తెలంగాణ భవన్‌లో కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక అనేక మోసాలు జరుగుతున్నాయి. 2 లక్షలు ఉద్యోగాలు ఏడాదిలో ఇస్తామన్నారు. ఒక్క నోటిఫికేషన్ కూడా రాలేదు. బీఆర్ఎస్ ప్రభుత్వం గ్రూప్-1 కింద 503 పోస్టులకు నోటిఫికేషన్ ఇస్తే.. దాన్ని రద్దు చేసి కొత్తగా 60 పోస్టులు కలిపి మళ్లీ నోటిఫికేషన్ ఇచ్చారు. దాన్ని కొత్త నోటిఫికేషన్ అంటున్నారు. 50 వేల పోస్టులతో మెగా డీఎస్సీ వేస్తమన్నాడు. తాము 5,089 పోస్టులతో డీఎస్సీ నోటిఫికేషన్ ఇస్తే దాన్ని కూడా రద్దు చేశారు. అయితే 50 వేల ఉద్యోగాలతో డీఎస్సీ నోటిఫికేషన్ వస్తదని అనుకుంటే.. 5,089 పోస్టులకు అదనంగా మరో 5913 కలిపి 11 వేల ఉద్యోగాలతో కొత్త



నోటిఫికేషన్ ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం కొత్తగా నోటిఫికేషన్లు ఇచ్చిందేమీ లేదు. ఇవ్వకపోగా 2 లక్షల ఉద్యోగాల మాట తుంగలో తొక్కారు. జాబ్ క్యాలెండర్ అతిగతి లేదు. 4 వేల నిరుద్యోగ భృతి హామీ ఇవ్వలేదని భట్టి విక్రమార్క పచ్చి అబద్ధం చెప్పారు అని కేటీఆర్ మండిపడ్డారు. ప్రభుత్వ ఉద్యోగాలకు నిర్వహించే రాత పరీక్షలకు రూపాయి కూడా ఫీజు తీసుకోనని రేవంత్ అన్నాడు.

## ఉద్యోగం కోసం వెళ్లి బానిసలయ్యారు!




న్యూఢిల్లీ: బ్యాంకాక్‌లో అధిక జీతంతో ఉద్యోగాలిప్పిస్తానంటూ ఓ దుబాయ్ ఏజెంట్ చేసిన మోసం 20 మంది భారతీయులను మయన్మార్‌లో నిర్బంధ కార్మికులుగా మార్చింది. అటవీ ప్రాంతంలో నిర్బంధించిన వారి తో 18 గంటలపాటు పని చేయించుకుటున్నారని, సరైన తిండి కూడా పెట్టడం లేదని, వెంటనే వారిని కాపాడాలని కోరుతూ బాధిత కుటుంబ సభ్యులు భారత విదేశాంగ శాఖను ఆశ్రయించారు.

### ముస్లింల ఓట్ల కోసం...

## కూటమి ముజ్రా

బీహార్: దళితులు, వెనుకబడిన తరగతుల (బిసిల) రిజర్వేషన్ల కైంకర్యానికి ఇండియా కూటమి చేస్తున్న యత్నాలను భగ్నం చేస్తానని ప్రధాని నరేంద్ర మోడీ శనివారం శపథం చేశారు. ముస్లిం వోటు బ్యాంకు కోసం కూటమి 'బానిసత్వానికి' పాల్పడుతున్నదని, 'ముజ్రా' చేస్తున్నదని మోడీ ఆరోపించారు. బీహార్‌లోని కరకత్, పాటలీపుత్ర లోక్‌సభ నియోజకవర్గాల్లో వరుస ర్యాలీల్లో ప్రసంగించిన ప్రధాని మోడీ ప్రతిపక్ష కూటమి 'బెదరింపులకు దిగుతోంది' అని ఆరోపించారు. ఉగ్రవాదాన్ని, అవినీతిని నిర్మూలించడానికి తాను 'భయం లేకుండా' కృషి చేస్తున్నట్లు ఆయన తెలిపారు. 'సామాజిక న్యాయానికి పోరాటంలో కొత్త మార్గం చూపిన ప్రాంతం బీహార్. ఎస్‌సిలు, ఎస్‌టిలు, ఒబిసిల హక్కులను లాక్కొని, ముస్లింలకు వాటిని మళ్లించాలన్న ఇండియా కూటమి వ్యూహాన్ని నేను భగ్నం చేస్తానని ఈ భూమిపై ప్రకటిస్తున్నా. వారు తమ వోటు బ్యాంకు సంతుష్టి కోసం బానిసలుగా ఉండి, 'ముజ్రా' ప్రదర్శించవచ్చు' అని ప్రధాని అన్నారు. పంజాబ్, తెలంగాణలలో కాంగ్రెస్ నేతలు, తమిళనాడు, పశ్చిమ బెంగాల్‌లలో డిఎంకె, టిఎంసి నేతలు బీహార్ వలస కార్మికులపై కించపరిచే వ్యాఖ్యలు చేయడం వల్ల రాష్ట్ర ప్రజలు నొచ్చుకున్నారని కూడా మోడీ ఆరోపించారు. 'తమ లాంతర్‌తో ముజ్రా చేస్తుండే ఈ ఆర్‌జెడి వారికి నిరసనగా మాట్లాడే ధైర్యం లేదు' అని ఆయన అన్నారు.



### మీ దేశం గురించి చూసుకోండి...

## పాక్ ఎంపీకి కేజ్రీవాల్ చురకలు..!


న్యూఢిల్లీ: భారత సార్వత్రిక ఎన్నికలపై ట్వీట్ చేసిన పాక్ ఎంపీ ఫవాద్ హుస్సేన్ చౌదరికి ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ చురకలంటించారు. తమ దేశం గురించి తాము చేసుకుంటామని.. ముందుగా అంతంత మాత్రంగానే ఉన్న మీ సొంత దేశం గురించి ఆలోచించుకోండంటూ సూచించారు. ఆరో విడత సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ కుటుంబ సభ్యులతో కలిసి ఢిల్లీలో ఓటు హక్కును వినియోగించుకుంటున్నారు. ఇందుకు సంబంధించిన ఫొటోను కేజ్రీవాల్ ఎక్స్ అకౌంట్‌లో షేర్ చేశారు. తాను భార్య, తండ్రి, పిల్లలతో కలిసి ఓటు వేశానని.. తల్లి ఆరోగ్యం బాగా లేకపోవడంతో రాలేకపోయిందన్నారు. నియంతృత్వం, నిరుద్యోగం, ద్రవ్యోల్బణానికి వ్యతిరేకంగా తాను ఓటు వేశానని.. మీరు కూడా వెళ్లి ఓటు వేయాలని ఢిల్లీ ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ పోస్ట్‌ను పాక్ ఎంపీ ఫవాద్ చౌదరీ రీపోస్ట్ చేశారు. ద్వేషం, అతివాదభావజాలంపై శాంతి, సామరస్యం విజయం సాధించాలన్నారు. మోర్ పవర్, ఇండియా ఎలక్షన్ 2024 అనే హ్యాష్ ట్యాగ్‌ను జత చేశారు. దీనిపై కేజ్రీవాల్ ఘాటుగానే స్పందించారు. 'చౌదరీ సాబ్.. నేను, మా దేశ ప్రజలంతా మా సమస్యలను పరిష్కరించుకోగలం. ఇందులో మాజీ జోక్యం అవసరం లేదు. ప్రస్తుతం పాక్‌లో అత్యంత దారుణమైన పరిస్థితి ఉంది. మీరు మీ దేశం గురించి ఆలోచించండి. భారత్‌లో ఎన్నికలు మా అంతర్గత విషయం. ఇందులో ఉగ్రవాదానికి నిలయమైన మీ దేశ జోక్యాన్ని



భారత్ సహించదు' అంటూ స్పందించారు. మళ్లీ ఫవాద్ చౌదరి స్పందిస్తూ.. సీఎం గారూ (కేజ్రీవాల్‌ను ఉద్దేశించి).. నిజానికి ఎన్నికలు మీ సొంత విషయమే కానీ తీవ్రవాదం పాకిస్థాన్‌లో ఉన్నా.. ఎక్కడ ఉన్నా అందరికీ ప్రమాదకరమేనన్నారు. ఆదర్శవంతమైన వ్యక్తులు మెరుగైన సమాజం కోసం ప్రయత్నించాలని.. పాక్ అంశం లేకుండా భారత రాజకీయ నాయకుల ప్రసంగం పూర్తి కాదన్నారు. కానీ, అదే పాక్‌లో భారత రాజకీయాలను ఎవరూ పట్టించుకోరన్నారు. బీజేపీ యాంటీ ముస్లిం సెంటిమెంట్ కోసం పాక్ పేరును వాడుకుంటుందన్నారు.

### గేమింగ్ జోన్‌లో అగ్నిప్రమాదం..

## ఇద్దరు పిల్లలు సహా 22 మంది సజీవదహనం



**రాజ్‌కోట్:** గుజరాత్‌లోని రాజ్‌కోట్‌లో భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. శనివారం సాయంత్రం టీఆర్‌పీ గేమింగ్ జోన్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో పెద్ద ఎత్తున మంటలు ఎగిసిపడ్డాయి. ఆ మంటల్లో చిక్కుకుని 22 మంది సజీవ దహనమయ్యారు. పలువురు తీవ్రంగా గాయపడ్డారు. కాగా, మృతుల్లో ఇద్దరు చిన్నారులు, ఒక మహిళ ఉన్నారు. లోపల మరింత మంది చిక్కుని ఉండొచ్చని అనుమానిస్తున్నారు. దీనివల్ల మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. ప్రమాదం గురించి తెలియగానే ఘటనాస్థలికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలు ఆర్పే ప్రయత్నాలు మొదలుపెట్టారు. కాగా, పెద్ద ఎత్తున గాలి దుమారం వచ్చినప్పటికీ శ్రమించి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. కాగా, మృతుల సంఖ్యను సరిగ్గా అంచనా వేయలేమని ఫైర్ స్టేషన్ ఆఫీసర్ ఆర్‌ఏ జోబన్ తెలిపారు. ప్రమాద స్థలం నుంచి మృతదేహాలను వెలికి తీస్తున్నామని పేర్కొన్నారు. సెర్చ్ ఆపరేషన్ కొనసాగుతుందని చెప్పారు. కాగా, మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.

### నిరుద్యోగిత, ధరల పెరుగుదల...

## పెద్ద సమస్యలు

### : ప్రియాంక గాంధీ

న్యూఢిల్లీ: దేశాన్ని వేధిస్తున్న సమస్యల్లో నిరుద్యోగిత, ధరల పెరుగుదల 'అతిపెద్దవి' అని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా శనివారం పేర్కొన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో ఇండియా కూటమి విజయం సాధిస్తుందన్న దృఢవిశ్వాసాన్ని ప్రియాంక వ్యక్తం చేశారు. కూటమికి అనుకూల వాతావరణం కనిపిస్తోందని ఆమె చెప్పారు. శనివారం ఉదయం తన వోటు వేసిన అనంతరం ప్రియాంక గాంధీ ఈ డవ్యాఖ్యలు చేశారు. ఎన్నికల్లో ఇండియా కూటమి గెలుస్తుందన్న దృఢనమ్మకాన్ని ప్రియాంక వ్యక్తం చేస్తూ, దేశంలో ప్రతి ఒక్కరికీ 'అతిపెద్ద సమస్యలు' నిరుద్యోగిత, అధిక ధరలు అని చెప్పారు. కాంగ్రెస్ నేతలు ఆప్ అభ్యర్థులకు వోటు వేస్తున్నారా అని, ఆప్ నేతలు కాంగ్రెస్‌కు వోటు వేస్తున్నారా అని అడిగినప్పుడు 'మా విభేదాలను పక్కన పెట్టి మన రాజ్యాంగం, ప్రజాస్వామ్యం కోసం వోటు వేస్తున్నాం. నేను అందుకు గర్విస్తున్నా' అని ప్రియాంక సమాధానం ఇచ్చారు. అంతర్గతంగా పరిస్థితులు భిన్నంగా ఉన్నాయని, తమ ఆందోళనలను పట్టించుకోవడం లేదన్న భావన ప్రజల్లో ఉందని ఆ తరువాత ఆమె విలేకరులతో చెప్పారు. 'బిజెపి నేతలు దాదాపు అన్ని రకాల విషయాలు మాట్లాడుతుంటారు. కాని ప్రధాన సమస్యలైన నిరుద్యోగిత, ధరల పెరుగుదల గురించి చర్చించరు. జనం ఇప్పుడు విసుగు చెందారు' అని ఆమె చెప్పారు. కాంగ్రెస్‌కు అనుకూలంగా ఏది పని చేస్తోందని ప్రశ్నించినప్పుడు ప్రియాంక సమాధానం



ఇస్తూ, 'మేము మొదటి నుంచి ప్రజల సమస్యల గురించి మాట్లాడుతున్నాం. దీనిపైనే మా ప్రచారం కూడా. మా మేనిఫెస్టో కూడా ఇదే ప్రస్తావించింది' అని తెలిపారు. ప్రియాంక గాంధీ భర్త రాబర్ట్ వాద్రా, వారి కుమార్తె మిరాయా వాద్రా, కుమారుడు రైహాన్ వాద్రా కూడా తమ వోట్లు వేశారు.

### బెంగళూరు రేవ్ పార్టీ కేసులో....

## చిత్తూరు అరుణ్ కుమార్ అరెస్టు



బెంగళూరు: బెంగళూరు రేవ్ పార్టీ కేసు దర్యాప్తు ముమ్మరం అయింది. ప్రధాన నిందితుడిగా ఉన్న వాసు ముఖ్య అనుచరుడు..కేసులో రెండో నిందితుడు(ఏ2) అయిన అరుణ్ కుమార్ ను బెంగళూరు క్రైమ్ బ్రాంచీ పోలీసులు అరెస్టు చేశారు. చిత్తూరు అరుణ్ కుమార్ బెంగళూరులో ఉంటూ రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నాడు. అంతేకాక రేవ్ పార్టీలను కూడా నిర్వహిస్తున్నాడని పోలీసులు గుర్తించారు. ఇదిలావుండగా బెంగళూరులోని బిఆర్ ఫామ్ హౌజ్ యజమాని గోపాల్ రెడ్డికి కూడా సిసిబి పోలీసులు నోటీసులు జారీచేశారు. సోమవారం విచారణకు రావాలని ఆదేశించారు. కాగా రేవ్ పార్టీ నుంచి తప్పించు పారిపోయిన పూర్ణా రెడ్డి అనే వ్యక్తి కోసం కూడా పోలీసులు గాలిస్తున్నారు. బెంగళూరు రేవ్ పార్టీలో 86 మంది డ్రగ్స్ తీసుకున్నట్లు పోలీసులు గుర్తించారు. వారిలో నటి హేమ, ఆషీ రాయ్ కూడా ఉన్నట్లు తెలిసింది. కాగా మిగతా వారి పేర్లను కూడా పోలీసులు ప్రకటించాల్సి ఉంది.

## సంపాదకీయం

# అవగాహనతోనే థైరాయిడ్ దూరం....

1965న ఏర్పడిన 'యూరోపియన్ థైరాయిడ్ అసోసియేషన్'కు గుర్తుగా ప్రతి ఏటా 25 మే రోజున 'ప్రపంచ థైరాయిడ్ దినం' నిర్వహిస్తూ, థైరాయిడ్ రుగ్మతలకు గల కారణాలను, నివారణ మార్గాలను, తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించుట జరుగుతున్నది. 25 నుంచి 31 మే వరకు ప్రతి ఏట 'అంతర్జాతీయ థైరాయిడ్ అవగాహన వారం' కూడా నిర్వహించడం ఆనవాయితీగా మారింది. 25 మే 2008 నుండి ప్రారంభమైన ప్రపంచ థైరాయిడ్ దినం వేదికగా థైరాయిడ్ రుగ్మతలు, జాగ్రత్తల పట్ల ప్రజల్లో అవగాహన కోసం ప్రసార మాధ్యమాలు, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా, సామాజిక మాధ్యమ వేదికలు, సభలు, సమావేశాలు, చర్చలు, విద్యాలయాల్లో పోటీలు లాంటి కార్యక్రమాలను నిర్వహిస్తారు. ప్రపంచ థైరాయిడ్ దినం–2024 నినాదంగా "అవగాహన, నిర్ధారణ, శ్రేయస్సుకు థైరాయిడ్ ఆరోగ్య పోషణ" అనబడే అంశాన్ని తీసుకున్నారు. సీతాకోక చిలుక ఆకారంలో ఉన్న థైరాయిడ్ వినాళ గ్రంథి మెడ కింది భాగంలో ఉంటుంది. ఎండోక్రైన్ వ్యవస్థలో భాగమైన థైరాయిడ్ గ్రంథిలో రెండు రెక్కల్లాంటి ఆకారాలను 'లోబ్స్' అని, వాటిని కలిపే కణజాలాన్ని 'థైరాయిడ్ ఇస్తుమస్' అని అంటారు. శరీరంలో జరిగే జీవక్రియలను నియంత్రించే టి4 (థైరాక్సిన్), టి3 (ట్రైఅయొడోథైరోనిన్), పెప్టైడ్ హార్మోన్ అనబడే కాల్సిటోనిన్ హార్మోన్లను స్రవిస్తుంది. థైరాయిడ్ హార్మోన్లతో సక్రమ జీవ క్రియ రేటు, గుండె పనితనం, మహిళల్లో రుతు చక్ర నియంత్రణ, కండర/జీర్ణ క్రియ విధులు, మెదడు అభివృద్ధి, ఎముకల పటిష్టత, ప్రోటీన్ సంశ్లేషణం, పిల్లల శారీరక అభివృద్ధి లాంటి ముఖ్య విధులను నిర్వహిస్తాయి. మెదడు కింది భాగాన ఉన్న పిట్యుటరీ గ్లాండ్ స్రవించే 'థైరాయిడ్ స్టిమ్యులేటింగ్ హార్మోన్, టియస్‌హెచ్ కారణంగా థైరాయిడ్ క్రియాశీలత ఆధారపడి ఉంటుంది. థైరాయిడ్ హార్మోన్లు అవసరం కన్న అధికంగా లేదా తక్కువగా స్రవించడం వల్ల పలు రుగ్మతలు కలుగుతాయి. అయోడిన్ లోపంతో థైరాయిడ్ వాపు (థైరాయిడిటిస్), గాయిటర్ (థైరాయిడ్ ఎన్లార్జిమెఎట్), థైరాయిడ్ నోడ్యూల్స్, కాన్సరస్ ట్యూమర్, థైరాయిడ్ సర్జరీ, జెనెటిక్ ప్రీడిస్పొజిషన్, ఆటోఇమ్యున్ గ్రేవ్స్ డిసీజ్, కాంజెనిటల్ సమస్యలు, థైరాయిడ్ స్టార్మ్ లాంటివి థైరాయిడ్ రుగ్మతలకు కారణం అవుతాయి. థైరాయిడ్ గ్రంథి అతి చురుకుగా పని చేసినపుడు 'హైపర్ థైరాయిడిజమ్' రుగ్మత కలిగి చేమట పట్టడం, ఆందోళనలు, రుతుస్రావం తగ్గడం, ఆకలి పెరగడం లాంటి రోగ లక్షణాలు కనిపిస్తాయి. థైరాయిడ్ గ్రంథి చురుకుదనం అతిగా తగ్గితే 'హైపోథైరాయిడిజమ్' రుగ్మత కలిగి బరువు తగ్గడం, ఒత్తిడి పెరగడం, అతిగా రుతుస్రావం లాంటి వ్యాధి లక్షణాలు కలుగుతాయి. భారత దేశ జనాభాలో 42 మిలియన్ల ప్రజలు థైరాయిడ్ రుగ్మతలతో బాధ పడుతున్నారు. థైరాయిడ్ రుగ్మతల్లో హైపర్ థైరాయిడిజమ్, హైపో థైరాయిడిజమ్, గాయిటర్, థైరాయిడ్ కాన్సర్, థైరాయిడిటిస్ లాంటి రుగ్మతలు ముఖ్యమైనవి. థైరాయిడ్ రుగ్మత ఉందని తెలియని ప్రజలు కూడా అసంఖ్యాకంగా ఉండటం విచారకరం. ఉత్తర భారతంలో హైపో థైరాయిడిజమ్ రుగ్మత అధికంగా బయట పడుతున్నది. ప్రతి 8 మంది మహిళల్లో ఒకరికి థైరాయిడ్ సమస్య టియస్‌హెచ్ ఉందని అంచనా. అయోడిన్ లోపం వల్ల గాయిటర్ వ్యాధి 200 మిలియన్ ప్రజల్లో ఉందని తేలింది. థైరాయిడ్ సంబంధ వ్యాధి నిర్ధారణకు టి3, టి4, టియస్‌హెచ్ హార్మోన్ల స్థాయిని నిర్ధారిస్తారు. కాల్సిటోనిన్ స్థాయిని బట్టి థైరాయిడ్ కాన్సర్‌ను నిర్ణయిస్తారు. థైరాయిడ్ రుగ్మతలకు చికిత్సలుగా థైరాయిడ్ సర్జరీ, మెడికేషన్, రేడియోఆక్టివ్ అయోడిన్, రేడియోషన్, హార్మోన్ పిల్స్, రీకాంబినంట్ హ్యూమన్ టియస్‌హెచ్ విధానాలను వాడతారు. థైరాయిడ్ సమస్యలకు విరుగుడుగా ప్రోటీన్, కాల్సియమ్, అయోడిన్, మెగ్నీసియం, సిలినియం, ఐరన్, విటమిన్ల ఆహారాన్ని తీసుకునేలా జీవనశైలిని మార్చుకోవాలి. అయోడిన్ లోపం ప్రధాన కారణంగా గుర్తించి థైరాయిడ్ సమస్యలకు పిల్లలు లోను కాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలి. సముద్ర ఆహారం, పాల ఉత్పత్తులు, అయొడైజ్డ్ ఉప్పు లాంటివి థైరాయిడ్ గ్రంథికి ఆరోగ్యాన్ని సమకూర్చుతాయి. పొగ/ఆల్కహాల్ త్రాగడం మానుకోవడం, పోషకాహారం తోసుకోవడం, ఒత్తిడిని జయించడం, నిద్రకు తగిన సమయాన్నివ్వడం, ఉదయ భానుడి కిరణాలు సోకేలా చూసుకోవడం, క్రమశిక్షణతో కూడిన దినచర్యను పాటించడం, తరుచుగా పరీక్షలు చేయించుకోవడం లాంటి జాగ్రత్తలతో థైరాయిడ్ రుగ్మతలకు దూరంగా జీవించవచ్చు. సులభంగా నివారించగల థైరాయిడ్ రుగ్మతల పట్ల లోతైన అవగాహన కలిగి, తరుచుగా పరీక్షలు చేయించుకుంటూ, ఆరోగ్యకర థైరాయిడ్ వినాళ గ్రంథిని నిర్మించుకుందాం, ఆరోగ్యకర భారతాన్ని నిర్మించుకుందాం. అయోడిన్ లోపంతో థైరాయిడ్ వాపు (థైరాయిడిటిస్), గాయిటర్ (థైరాయిడ్ ఎన్లార్జిమెఎట్), థైరాయిడ్ నోడ్యూల్స్, కాన్సరస్ ట్యూమర్, థైరాయిడ్ సర్జరీ, జెనెటిక్ ప్రీడిస్పొజిషన్, ఆటోఇమ్యున్ గ్రేవ్స్ డిసీజ్, కాంజెనిటల్ సమస్యలు, థైరాయిడ్ స్టార్మ్ లాంటివి థైరాయిడ్ రుగ్మతలకు కారణం అవుతాయి.

# ప్రాసెసింగ్ క్లస్టర్ ఏర్పాట్లను పరిశీలించిన మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతం






**జిల్లా బ్యూరో మేడ్చల్ మల్కాజ్గిరి (గరుడ వార్త) :** మేడ్చల్ జిల్లాలోని పూడూరు గ్రామం లో పరిశ్రమల పునరుత్పత్తి పథకం లో భాగంగా సూక్ష్మ చిన్న మరియు మధ్య తరహా మంత్రిత్వ శాఖ వారి ఆధ్వర్యంలో ప్రాసెసింగ్ క్లస్టర్ నిర్మాణంతోపాటుగా కూరగాయలు ,పండ్ల ప్రాసెసింగ్ యంత్రాలకొనుగోలు, ఇన్స్టాలేషన్ ఏర్పాట్లను మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ పరిశీలించారు. శనివారం రోజు పూడూరు లోని ఆదర్శ రైతు సేవా సహకార సంఘంలో సాంప్రదాయ పరిశ్రమల పునరుత్పత్తి పథకం క్రింద సూక్ష్మ, చిన్న మరియు మధ్యతరహా మంత్రిత్వ శాఖ వారి ఆర్థిక సహాయంతో కూరగాయలు మరియు పండ్ల ప్రాసెసింగ్ క్లస్టర్ నిర్మాణానికి ఏర్పాట్ల ను కలెక్టర్ పరిశీలించారు. మేడ్చల్ జిల్లాలోని మార్కెట్లనుండి ఏటా సుమారు 190 టన్నుల కూరగాయలు మరియు పండ్లు వ్యర్థమవుతున్నాయని ఇట్టి వ్యర్థాన్ని అరికట్టడానికి, రైతులకు గిట్టుబాటు ధర కల్పించడానికి కూరగాయల ధరలు పడిపోయినప్పుడు వాటిని కట్ చేసి కూరగాయలు మరియు కట్ ఫ్రూట్స్ ప్యాకింగ్, సాసులు, ప్యూరీ,పౌడర్ మరియు చట్నీలను చేయడానికి ఉపయోగపడతాయన్నారు. దీనికిగాను సూక్ష్మ,చిన్న మరియు మధ్య, తరహా పరిశ్రమల మంత్రిత్వ శాఖ నోడల్ ఏజెన్సీగా వ్యవహరిస్తుందని తెలిపారు. ఈ క్లస్టర్ పనులను కలెక్టర్ పరిశీలించి తగిన సలహాలు సూచన లు సంబంధిత అధికారులకు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యాన శాఖ అధికారి నీరజ గాంధీ, NI-MSME అధికారి సూర్య ప్రకాష్ గౌడ్, ఆదర్శ రైతు సేవా సహకార సంఘం ప్రెసిడెంట్ సుధాకర్ రెడ్డి, సొసైటీ వైస్ ప్రెసిడెంట్, డైరెక్టర్లు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.


# బంగాళాఖాతంలో వాయుగుండం

**హైదరాబాద్. మే** పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ఇవాళ వాయుగుండంగా మారుతుందని వాతావరణ శాఖ తెలిపింది. ఈ నెల 26 తేదీ సాయంత్రానికి అది మరింత బలపడి తుపానుగా మారుతుందని స్పష్టం చేసింది. ఈశాన్యంగా కదులుతూ మధ్య బంగాళాఖాతంలో తుపానుగా మారనున్నప్పటికీ.. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్ తీర ప్రాంతానికి ముప్పేమీ లేదని వాతావరణశాఖ స్పష్టం చేసింది. అయితే.. తెలుగు రాష్ట్రాల్లో మోస్తారు నుండి భారీ వర్షంతోపాటు.. గంటకు 40 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉన్నట్లు తెలిపింది.వాయుగుండంగా మారనున్న బలమైన అల్పపీడనం కారణంగా.. రెండు రోజుల్లో కోస్తాంధ్ర తీర ప్రాంతాల్లో చాలా చోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నట్లు వెల్లడించింది. ఇక.. వాయుగుండం ప్రభావంతో ఉత్తర కోస్తాంధ్రలోని పార్వతీపురం మన్యం, అల్లూరి జిల్లాలతోపాటు కాకినాడ, కోనసీమ, ఏలూరు, ఎన్టీఆర్, సత్యసాయి జిల్లాల్లో చాలా చోట్ల మోస్తరు వర్షాలు కురిసే సూచనలు ఉన్నాయి. అలాగే.. శ్రీకాకుళం, అనకాపల్లి, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, కృష్ణా, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, నెల్లూరుతోపాటు పలు జిల్లాల్లోనూ ఉరుములు, పిడుగులతో కూడిన వర్షాలు పడే సూచనలు ఉన్నట్లు వాతావరణ శాఖ తెలిపింది.బంగాళాఖాతంలోని వాయుగుండం ప్రభావంతో



మత్స్యకారులు చేపల వేటకు వెళ్లొద్దని హెచ్చరికలు జారీ చేసింది. మరోవైపు.. పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్ప పీడనం.. వాయుగుండంగా మారునుండడంతో హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో వర్షం పడనున్నట్లు వాతావరణశాఖ చెప్పింది. తెలంగాణ వ్యాప్తంగా ఇవాళ పలు జిల్లాల్లో మోస్తరు నుండి కొన్ని చోట్ల భారీ వర్షాల పడే ఛాన్స్ ఉందంది. అటు.. బంగాళాఖాతంలో నైరుతి రుతుపవనాలు చురుగ్గా కదులుతున్నట్లు వాతావరణ శాఖ వెల్లడించింది.

# బాజాప్తా చెరువుల మట్టిని తోడేస్తున్నారు జోరుగా అక్రమ మట్టి దందాఅధిక లోడుతో రోడ్లు ధ్వంసం అనుమతులు లేని రవాణా... ప్రభుత్వ ఆదాయానికి గండి




**పెద్దపల్లి** వేసవి కాలం మొదలు కాగానే అక్రమ మార్కుల కన్నులు చెరువు మట్టిపై పడుతాయి. ప్రభుత్వం అనుమతి ఇచ్చిందే తడువు ఇక దోపిడీకి తెర లేపడం తరువాయి. ఇక ఇక్కడి నుండి సినిమా మొదలవుతుంది. ఆ ఊరు గ్రామ పంచాయితీ పర్మిషన్ నుండి మొదలు కొని వే బిల్లులు, ఆ పర్మిషన్ ఈ పర్మిషన్ అంటూ ఇటు అధికారుల తిరకాసులతో సదరు కాంట్రాక్టర్ల పరుగులు. ఇక అంతా అయిందనుకునే సమయంలోనే చిన్నా చితిక పెద్ద పత్రికలు, మీడియా చానళ్ళు. మళ్ళీ ఊపిరి పీల్చుకునే సమయంలో పలు సంఘాలు, ఆయా పార్టీల ప్రజాప్రతినిధులు, నాయకులు గద్దల్లా వాలుతారు. అన్ని దులిపేసుకుని మట్టి దందా మొదలు కావడం కొద్ది రోజులు సజావుగా సాగుతుంది. సదరు కాంట్రాక్టర్ ఇక అడ్డు అదుపు లేకుండా 24/7 తన పని తాను కానిస్తుంటాడు. అందరికి సర్దుబాటు జరిగితే అటు వైపు ఏ ఒక్కరు కన్నెత్తి చూడరు. ఎవరికీ తక్కువైనా కాంట్రాక్టర్ కథ మళ్ళీ మొదటికే వస్తుంది. ఈలోగా కాంట్రాక్టర్ తన పని పూర్తి చేసుకొని దుకాణం మూసుకుంటాడు. కానీ ఇక్కడ తనిఖీ చేయాల్సిన అధికారులు ఎందుకు విధులు సరిగా నిర్వహించడం లేదు. అను మతి ఇచ్చి చేతులు దులుపు కుంటే సరిపోతుందా. నిత్యం వందలాది టిప్పర్లు, లారీలు ఆయా మండలాల నుండి పెద్దపల్లి జిల్లా కేంద్రం నుండి ఇటుక బట్టీలకు మట్టి రవాణా జరుగుతున్నా చోద్యం చూస్తున్నారు. ప్రజా ధనం లూటి అవుతున్నా, వేల వేలకు జీతాలు తీసుకొని విధులు సక్రమంగా నిర్వహించని ఇలాంటి అధికారులపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. కాంట్రాక్టర్ నుండి ముడుపులు ముడితే ఒకలా లేకపోతే మరోలా ఉండే అధికారులపై చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. జిల్లా కేంద్రానికి పక్కనే ఉన్న కమాన్ పూర్, రామగిరి మండలాల నుండి ఆయా గ్రామాల మీదుగా చెరువు మట్టిని రాఘవాపూర్ ఇటుక బట్టీలకు టిప్పర్ల ద్వారా బాజాప్తా మట్టిని తరలిస్తున్న కాంట్రాక్టర్ సరైన పత్రాలు లేకుండా నిర్భయంగా తరలించడంలోని ఆంతర్యం ఏమిటి. ఆయా మండలాల అధికారులు ఏమి చేస్తున్నట్లు. గత పదిహేను రోజులుగా ఈ తతంగం సాగుతున్నదని పలువురు ప్రజలు పేర్కొంటున్నారు. నిత్యం మంథని – పెద్దపల్లి జిల్లా కేంద్రానికి తనిఖీల పేరుతో తిరిగే జిల్లా స్థాయి అధికారులకు కూడా కనిపించడం లేదా అంటూ పలువురు ఆరోపణలు గుప్పిస్తున్నారు. ఇటీవల గ్రీన్ ట్రిబ్యునల్ తీర్పుతో హడావుడి చేస్తున్న అధికారులు తమ భాద్యతలు ఇప్పటి వరకు ఎందుకు మరిచినట్లు. కోర్టు చెపితే గానీ భాద్యతలు గుర్తుకు రావా అంటున్నారు ఆయా స్వచ్ఛంద సంఘాల ప్రతినిధులు. ఇది కూడా ప్రజల పిర్యాదు చేస్తే కానీ అధికారులు స్పందించాల్సి రావడం దురదృష్టకరం. నిత్యం జరుగుతున్న ఇలాంటి దోపిడీని అరికట్టేందుకు అధికారులు చిత్తశుద్ధితో పని చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# సబ్సిడీ పై పచ్చిరొట్ట విత్తనాలు




**శామీర్ పేట, (గరుడ వార్త) :** రైతుల కొరకు పచ్చిరొట్ట విత్తనాలు సబ్సిడీపై అందుబాటులో ఉన్నాయని శామీర్ పేట వ్యవసాయ అధికారి రమేష్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ మండల కేంద్రం శామీర్ పేట రైతుసేవ సహకార సంఘంలో పచ్చిరొట్ట విత్తనాలైనా జనము, జీలుగా 60 శాతం సబ్సిడీపై అందుబాటులో ఉన్నాయని చెప్పారు. జనము 40 కేజీల బస్తా రూ. 3620 ఉండగా సబ్సిడీ రూ. 2172 ఫోను రూ. 1448 చెల్లించాలన్నారు. అలాగే జీలుగా 30 కేజీల బస్తా రూ. 2790 ఉండగా సబ్సిడీ రూ. 1674 ఫోను రూ. 1116 చెల్లించాలని చెప్పారు. కావలసిన రైతులు తమ పట్టాదారు పాసుపుస్తకం తో పాటు ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలను సహకార సంఘంలో అందజేసి సబ్సిడీ పచ్చిరొట్ట విత్తనాలను తీసుకెళ్లాలని సూచించారు. ఈ విత్తనాలను పొలంలో చల్లుకొని 40 రోజులకు పొలంలో కళ్ళు దున్నాలన్నారు. దీంతో నేల సారవంతం పెరిగి అధిక దిగుబడులు వస్తాయని చెప్పారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# అలియాబాద్ గ్రామ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన తహసిల్దార్





**శామీర్ పేట, (గరుడ వార్త) :** రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే తమ ధాన్యాన్ని విక్రయించాలని తాహసిల్దార్ యాదగిరి రెడ్డి కోరారు. శనివారం శామీర్ పేట మండలం అలియాబాద్ లోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తాహసిల్దార్ యాదగిరిరెడ్డి సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు దలారులను నమ్మి మోసపోవద్దన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలోనే రైతులు తమ ధాన్యమును విక్రయించాలని తెలిపారు. దళారులు అధికంగా తరుగు తీసి రైతులకు నష్టం కలిగిస్తారని చెప్పారు.

కొనుగోలు కేంద్రంలో ఏవైనా సమస్యలు ఉన్నాయా అని నేరుగా రైతులని అడిగి తెలుసుకున్నారు. గన్ని బ్యాగులు సమయానికి అందుతున్నయా లేదా తెలుసుకున్నారు. అనంతరం కొనుగోలు కేంద్రంలోని రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకుడు, మాజీ సర్పంచ్ కమటం కృష్ణారెడ్డి, స్థానికులు నరేందర్ రెడ్డి, సంజీవరెడ్డి, రాంరెడ్డి, ఎల్లయ్య, భాను, ప్రకాష్, ప్రభాకర్ రెడ్డి, రాజు రైతులు తదితరులు పాల్గొన్నారు.

# రేవంత్ ని అరెస్ట్ చేయండి




**హైదరాబాద్, మే** సీఎం రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మరోసారి ఘాటైన వ్యాఖ్యలు చేశారు. సీఎం రేవంత్ రెడ్డి తనపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని.. ఆయన ఫేక్‌న్యూస్ పెడ్లర్ అంటూ విమర్శలు సంధించారు. ఈ మేరకు శుక్రవారం సోషల్ మీడియా ప్లాట్ ఫాం ఎక్స్ వేదికగా పలు ప్రశ్నలు సంధించారు. సీఎం రేవంత్ రెడ్డి.. తన బంధువుకు రూ.10 వేల కోట్ల కొవిడ్ డ్రగ్ కాంట్రాక్ట్ వచ్చిందని గతంలో ఆరోపించారన్నారు కేటీఆర్, అంతేకాదు గతంలో తాము అధికారంలో ఉన్న సమయంలో సచివాలయంలో నిజాం ఆభరణాల కోసం సొరంగం తవ్వినట్లు కథనాలు సృష్టించారని.. ఆయనో ఫేక్‌న్యూస్ పెడ్లర్ అంటూ తీవ్రస్థాయిలో మండిపడ్డారు.కేటీఆర్ ఏమని పోస్ట్ చేశారంటే..?రూ.10 వేల కోట్ల కొవిడ్ డ్రగ్ కాంట్రాక్ట్ వచ్చిందని ఆరోపించారుసచివాలయంలో నిజాం ఆభరణాలు తవ్వినట్లు నకిలీ కథనాలు పుట్టించారుకేంద్రహోంమంత్రి అమిత్‌షా కు సంబంధించిన ఫేక్ వీడియోను సర్క్యులేట్ చేశారుఉస్మానియా యూనివర్సిటీకి సంబంధించిన ఫేక్ సర్క్యులర్ పోస్ట్ చేశారుసీఎం హోదాలో ఉండి తప్పుడు ఆరోపణలు, తప్పుడు ప్రచారాలు చేస్తున్న రేవంత్‌ని జైలులో ఎందుకు పెట్టకూడదు.. అంటూ కేటీఆర్ ఎక్స్ వేదికగా ప్రశ్నించారు.కాగా.. గత కొన్ని రోజుల నుంచి కాంగ్రెస్.. బీఆర్ఎస్ పార్టీల మధ్య మాటల తూటాలు పేలుతున్నాయి. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలు, వరికి బోనస్ తదితర అంశాలే టార్గెట్ గా బీఆర్ఎస్ కాంగ్రెస్ ను విమర్శిస్తోంది.

గరుడ వార్త



# బొమ్రాసిపేట లో కూల్చివేతలు



**మేడ్చల్:** మాజీ మంత్రి మల్లారెడ్డికి మరో షాక్ తగిలింది. షామీర్ పేట్ మండలంలోని బొమ్రాసిపేట్ పెద్ద చెరువు పక్కనే ఉన్న సర్వే నెంబర్ 315,407,408 మాజీ మంత్రి మల్లారెడ్డి సంబంధించి 6 ఎకరాల భూమి ఉంది. అందులో ఎఫ్టిఎల్ లో ఆక్రమించి ప్రహరీ గోడ నిర్మించారని గతంలో మల్లారెడ్డి పై గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. శుక్రవారం ఉదయం ఇరిగేషన్ రెవెన్యూ అధికారులు జెసిబిల సాయంతో చెరువులో నిర్మించిన ప్రహరీ గోడలను కూల్చి వేశారు.

# ప్రజయ్ హోమ్స్ లో చోరీ

**మేడ్చల్ :** మేడ్చల్ జిల్లా షామీర్పేట్ లో దొంగలు రెచ్చిపోయారు. శామీర్పేట్ మండలంలోని మజీద్పూర్ లోని ప్రజయ్ హోమ్స్ తాళం వేసిన ఇండ్లను టార్గెట్ చేస్తూ దొంగతనాలు చేస్తున్నారు. మూడు రోజుల కిందట అనిల్ కుమార్ యాదవ్ అనే వ్యక్తి ఫంక్షన్ కి వెళ్లి తిరిగి వచ్చేసరికి ఇంటి తాళం దొంగలు పగలగొట్టారు. ఇంట్లో ఉన్న 13 తులాల బంగారం ,68 వేలు నగదు దొంగిలించారు. దీంతో అనీల్ యాదవ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తాజాగా మరో రెండు ఇంట్లో షరీఫ్ ,శ్రీనివాస్ ఇంట్లో 30 తులాల బంగారం , 93 వేలు నగదు దోచుకెళ్లారు. దీంతో స్థానికులు వరుస దొంగతనాలు భయభ్రాంతులకు గురవుతున్నారు

# బంగ్లాదేశ్ ఎంపీ అజీం అనార్ కేసులో వెలుగులోకి షాకింగ్ వివరాలు



**కోల్ కతా మే :** ఇండియాలో ఇటీవల హత్యకు గురైన బంగ్లాదేశ్ ఎంపీ అన్వరుల్ అజీం అనార్ కేసులో షాకింగ్ వివరాలు వెలుగులోకి వచ్చాయి. ఇప్పటికే పశ్చిమ బెంగాల్ సిఐడి పోలీసులు ముగ్గురు నిందితులను పట్టుకున్నారు. వారిలో ఒకడు హత్య ఎలా చేసింది పోలీసులకు తెలిపాడు. బంగ్లాదేశ్ సంతతికి చెందిన అమెరికా పౌరుడు అఖ్తరుజ్జామన్ ఆదేశాలతోనే తనతో పాటు మరి నలుగురు బంగ్లా జాతీయులు ఈ హత్యలో పాల్గొన్నట్లు తెలిపాడు. ఎంపీని గొంతు నులిమి చంపామని అతడు పేర్కొన్నాడు. మృతదేహాన్ని గుర్తుపట్టకుండా ఉండేందుకు చర్మం ఒలిచామని, ముక్కముక్కలు చేసినట్టు చెప్పాడు. ఆ ముక్కలను ప్లాస్టిక్ కవర్లలో పెట్టి నలువైపులా పడేసినట్లు వివరించాడు. ఇదిలావుండగా ఆ బంగ్లాదేశ్ ఎంపీని హనీ ట్రాప్ చేసి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. టౌన్ హాల్ ప్రాంతంలోని అపార్ట్మెంట్లోకి ఇద్దరు పురుషులు, ఓ మహిళ వెళ్లిన సిసిటివి దృశ్యాలను పోలీసులు పరిశీలించారు. బంగ్లాదేశ్ ఎంపీ హత్య ఎందుకు జరిగిందన్నది ఇంకా తేలాల్సి ఉంది. పోలీసులు అనేక కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు.

# ఎమ్మెల్సీ పట్టభద్రుల ఎన్నికల్లో మీ మొదటి ప్రాధాన్యత ఓటు మల్లన్నకే వేయండి - ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



జయశంకర్ భూపాలపల్లి: ఎమ్మెల్సీ పట్టభద్రుల ఎన్నికల్లో మీ మొదటి ప్రాధాన్యత ఓటు మల్లన్నకే వేసి అత్యధిక మెజారిటీ తో గెలిపించండని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. శనివారం భూపాలపల్లి పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన ప్రెస్ మీట్ లో కాంగ్రెస్, సిపిఐ, సిపిఐ(ఎం) ముఖ్య నేతలతో కలిసి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రజల తరుఫున ప్రశ్నించే వ్యక్తి తీన్మార్ అని వారిని ఈ ఎమ్మెల్సీ ఎన్నికల్లో భూపాలపల్లి నుండి అత్యధిక మెజారిటీతో గెలిపించుకుందామని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. తీన్మార్ మల్లన్న గెలుపు కొరకు ప్రతీ ఒక్కరూ కష్టపడాలని సూచించారు. జీవో నంబర్ 46, 317 ఇతర ఉద్యోగుల సమస్యలపై కాంగ్రెస్ కేబినెట్ సబ్ కమిటీ వేసి పరిష్కరిస్తుందని అన్నారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ప్రజా వ్యతిరేక విధానాలపై తీన్మార్ మల్లన్న పోరాటం చేసినట్లు ఈ సందర్భంగా ఎమ్మెల్యే అన్నారు. కాంగ్రెస్ పార్టీ మేనిపెస్టో లో పెట్టిన ప్రతీ హామిని నెరవేరుస్తుందని తెలిపారు. ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే మళ్ళీ అన్ని సంక్షేమ పథకాలు ప్రారంభం అవుతాయని ఎమ్మెల్యే తెలిపారు.

# నీటి పరిరక్షణ సామాజిక బాధ్యత......





నీరు ప్రకృతిలో ఉన్న సమస్త జీవులకు ప్రాణాధారము. ప్రకృతి సమస్త జీవులకు ప్రసాదించిన ఒక అపరూపమైన పదార్థము. మనిషి జీవించడానికి గాలి ఎంత అవసరమో నీరూ అంతే అవసరం. నీరే లేకపోతే పచ్చని చెట్లు, పారే నదులు, జీవులు, మహా సముద్రాలు ఏమీ ఉండవు. ఇవేమీ లేకుండా ఎండిపోయిన మట్టి గడ్డలా ఉంటుంది భూమి. భూమిమీద వృక్షాలు, జంతువులు, మానవాళి మనుగడకు, వాటి పెరుగుదలకు గాలి తరువాత ముఖ్యమైనది నీరు. భారత్‌లో సింధు నాగరికత, ఈజిప్టులో నైలు నది నాగరికత ఇలా ప్రపంచ నాగరికతలు నదీ తీరాలు, నీటి వనరులకు సమీప ప్రాంతంలో విలసిల్లాయి. మన చరిత్రంతా జలవనరుల తోనే ముడిపడి ఉంది. నీటిని పరిరక్షించుకోవాలనే నినాదాన్ని ప్రాచీన నాగరికతలు వెల్లడించాయి. భారతీయులకు నీటి విలువ తెలుసు కనుకే నదులను పూజించే ఆచారం ఉంది. నీటిని పూజించి, నదులకు, చెరువులకు, జలాశయాలకు హారతులిస్తారు. నారం అంటే నీరు. నీటిలో ఉంటాడు కాబట్టి శ్రీమహావిష్ణువుకు నారాయణుడు అని పేరు. నీటినే రూపంగా స్వీకరించి విష్ణువు నీటి విలువను చెప్తున్నాడు. శివుడు ఏకంగా గంగను తన తలపై ధరించి గంగాధరుడయ్యాడు. నీటిని వృధా చేయడం సృష్టికి, భగవత్తత్వానికి, సమస్త ప్రాణకోటికి వ్యతిరేకమని పురాణాలు, ప్రాచీన గ్రంధాలు స్పష్టం చేస్తున్నాయి. నీరు మూడు రూపాలలో... ఘన రూపం అంటే మంచు గడ్డల రూపంలోను, ద్రవ రూపం, సముద్రాలు, నదులు, తటకములు మొదలగునవి, వాయు రూపంలో భూమండలం పై 71 శాతానికి పైగా ఆవరించి ఉంది. క్రొత్త క్రొత్త సమ్మేళన పదార్థముల తోను, విష పూరిత రసాయన పదార్థాల తోను నీరు కలుషిత మౌతున్నది. అలా కలుషితమైన జలము జల చక్రము ద్వారా తిరిగి ఆవిరి రూపం ధరిస్తుంది. ఈ క్రమంలో ఆ జలం తనలోని ఇతర కలుషిత పదార్థములను, అనగా రసాయన పదార్థములను కూడా కలుపుకొని వాయు రూపంలో మేఘాలుగా మారి అక్కడి వాతావరణం అనుకూలించ గానే ద్రవించి తిరిగి వర్ష రూపంలో తిరిగి భూమిని చేరుతున్నది. ఆ కలుషిత మేఘాలు వర్షించినపుడు రంగులలో వర్షము కురవడము, ఆమ్ల వర్షాలు కురవడము సర్వ సాధారణము. దాంతో ప్రకృతికి అపార నష్టము జగురుతున్నది. జీవ వ్యవస్థలో నీరు మంచి ద్రావణి, ఇందులో చాలా వరకు లవణాలు కరుగుతాయి. అందుకే దాన్ని విశ్వవ్యాప్త ద్రావణి అంటారు. ఇంచుమించు అన్ని జీవ రసాయనాలు నీటిలో కరుగుతాయి. ఇందువల్ల నీరు జీవ పదార్థాల రవాణాకు తోడ్పడుతుంది. నీటి ఎద్దడిని ప్రపంచంలో 80 దేశాలు ఎదుర్కొంటున్నాయి. గొంతు తడుపుకునే చుక్క నీటికోసం మైళ్లకు మైళ్లు నడిచి పోవాల్సిన పరిస్థితిలో కూడా నేటి ప్రజలు ఉన్నారు. మంచి నీళ్ళు దొరకక కుంటల్లో, గుంటల్లో అడుగు బొడుగు మురికి నీటినే తాగాల్సిన దుస్థితిలో ఎంతో మంది ఉన్నారు. వేసవిలో చాలా చోట్ల నీటి కొరత మూలంగా, కనీసం తాగు నీరు దొరకక ఎంతో మంది బిందెలతో బహు దూరం కిలో మీటర్ల వరకు నడిచి వెళ్లి త్రాగు నీటిని తెచ్చుకునే అనివార్య పరిస్థితులను చూస్తూనే ఉన్నాం. మంచినీటి కంటే సముద్రపు నీరు చాలా ఎక్కువ పరిమాణంలో ఉంది. మనం నివసించే భూగోళంలో ఉన్న నీటి వనరులలో 99% ఉన్నది ఉప్పునీరే. ఇది 97% సముద్రాల్లోనే ఉంది. మిగతాది నదులు, చెరువుల్లో ఉంది త్రాగడానికి పనికొచ్చే నీరు 1% మాత్రమే. ఇందులో చెరువుల్లో 0.86%, నదుల్లో 0.02% ఉండగా మిగిలినవి భూగర్భ జలాలు. ప్రపంచ వ్యాప్తంగా త్రాగడానికి ఉపయోగపడే నీరు 0.3% మాత్రమే. నీటితో జీవం అంకురించింది. ప్రకృతి మనుగడ నీటితోనే కొనసాగుతోంది. జీవవైవిధ్య పరిరక్షణ. జీవం జలంతోనే సాధ్యమవుతుంది. ఇవన్నీ తెలిసినా..నీటిని వృధా చేస్తున్నాం..నీటి వనరుల్ని వ్యర్థాలతో కలుషితం చేస్తున్నాం. ప్రపంచంలో కోట్లాది మంది తాగడానికి నీరు లేక దాహంతో అల్లాడి పోతుంటే...మనకు అందుబాటులో ఉన్న నీటిని వృధా చేస్తున్నాం. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే..2050 నాటికి ఈ భూమ్మీద తాగడానికి పుష్కలమైన నీరు ఉండనే ఉండదని, ప్రజలు స్నానాలు చేయడం మానేసి శరీరానికి రసాయనిక లేపనాలు రాసుకుంటారనీ.. (కెమికల్ బాత్) వాటితోనే స్నానాలు చేస్తారనీ..దేశ సరిహద్దుల్లో కాపలా కాయాల్సిన సైనికులు నీటి వనరుల చుట్టు కాపలా కాయాల్సిన పరిస్థితి ఉంటుందని.. తలంటు కోవడానికి నీరు సరిపోక ప్రజలందరూ బోడి గుండుతో జీవిస్తారనీ, స్త్రీ పురుషులందరూ రోజు తల షేవ్ చేసుకునే పరిస్థితి వస్తుందని దివంగత మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం వ్యాఖ్యానించారంటే పరిస్థితిని ఎలా ఉంటుందో అంచనా వేయొచ్చు. నీటి సంరక్షణ చర్యల్లో భాగంగా.. ఉన్న నీటిని సద్వినియోగం చేసు కోవడం, వృధాను అరికట్టడం, పొదుపుగా వాడటం, పునర్వినియోగం..తదితరాలన్నింటికీ ప్రాధాన్య మివ్వాలి.

# మసకబారుతున్న కుటుంబ బంధాలు...!



భారతీయ సంస్కృతికి, సంప్రదాయాలకు, నాగరికత పురోగతికి మూలమైనది ఉమ్మడి కుటుంబ వ్యవస్థ. ఆ వ్యవస్థ మూలాలే నేడు ఆధారాలను కోల్పోతున్నాయి. రక్త సంబంధము, సహచరత్వము, ఒకే నివాసం అంశాల విషయంలో కుటుంబ నైతిక, సామాజిక సూత్రాలు, సమైక్యత, సంఘటిత సమిష్టి జీవన విధానం గురించి ఈ కాలంలో పట్టింపులు లేకుండా పోతున్నాయి. కుటుంబం అనగా ఒకే గృహంలో నివసించే కొంత మంది మానవుల సమూహం. వీరు సాధారణంగా పుట్టుకతో లేదా వివాహముతో సంబంధమున్నవారు. సమాజంలో వివిధ మతపరమైన వివాహ చట్టాలు కుటుంబ వ్యవస్థను గుర్తించాయి. నాగరికత విస్తరణకు పూర్వమే మనదేశంలో ఉమ్మడి కుటుంబ వ్యవస్థ ఉందని వివిధ గ్రంథాలలో పొందుపరచబడి ఉంది. నాగరిక ప్రపంచంలోనూ మన దేశంలో ఉమ్మడి కుటుంబ వ్యవస్థ మూడుపువ్వులు ఆరు కాయలుగా వర్ధిల్లింది. మనదేశంలో ఉమ్మడి కుటుంబాలు సిరిసంపదలతో తూలతూగాయనడంలో సందేహం లేదు. ఒక కుటుంబంలో తాత మొదలు వారి పిల్లలు వారి పిల్లలు ఇలా మూడు నుంచి నాలుగు తరాలు ఉమ్మడి అనే గొడుగు కింద ఒదిగి పోయేవి. ఇంటి లోని పెద్దకు అందరూ గౌరవం ఇవ్వాల్సిందే. ఆయన మాటే వేదవాక్కు. అందరిదీ ఉమ్మడి వ్యవసాయమే. సమష్టి సంపదనే, సమష్టి భోజనాలే ఉండే వంటే ముచ్చటేస్తుంది. తల్లిదండ్రులు, అత్తమామలు, అక్క చెల్లెళ్లు, అన్నదమ్ములు, బావా మరదళ్లు, బంధు మిత్రులు, తాతలు, బామ్మలు, మనవలు, మనవ రాండ్రతో కళకళలాడే ఉమ్మడి కుటుంబాలు ఆప్యాయతలు ప్రేమానురాగాలకు నిలయాలు. పిల్లలు చిన్నవయస్సులో ఉన్నపుడు తల్లిదండ్రుల చెంతనే ఉంటారు. వారు పెద్దవారై పెళ్ళిళ్ళు అయిపోతే ఎవరి కుటుంబాలు వారివే. అంటే ఒక కుటుంబం నుంచి మరిన్ని కుటుంబాలు ఉద్భవిస్తున్నాయి. ఒక కుటుంబం మరెన్ని కుటుంబాలను సృష్టించి నప్పటికీ వంశవృక్షపు వేళ్లు మాత్రం మొదటి కుటుంబం వద్దే ఊనుకుని ఉంటాయి. అందుకే సంవత్సరంలో ఒక రోజైనా అందరూ కలుసు కోవాలని సరదాగా గడపాలని కోరుకోవడం సహజం. ఆధునిక యుగంలో ఒకే ఇంట్లో ఉన్నప్పటికీ ఒకరినొకరు పలుకరించుకునే సమయం చిక్కని కుటుంబాలు ఎన్నో. కేవలం ఫోన్‌లోనో, మొబైల్‌లోనో యోగ క్షేమాలు కనుక్కునే కుటుంబాలు కూడా లేకపోలేదు. ఒకప్పుడు ఉమ్మడి కుటుంబాలకు మనదేశం పుట్టిల్లు. ఇప్పుడు ఆ సంస్కృతి భూతద్దం పెట్టి వెతికినా దొరకదంటే అతిశయోక్తి కాదు. అనేక కుటుం బాలు వ్యక్తిగత కారణాలతో విచ్ఛిన్నం కావడం మనం రోజూ చూస్తూ ఉన్నదే. అయినప్పటికీ మన దేశంలో అనేక కుటుంబాల మధ్య కనిపించే అన్యోన్యతా భావం మరే దేశంలోనూ కనిపించదు. విదేశీ పాలకుల పాలనలో ఉమ్మడి కుటుంబాలుగా చెలామణి అయిన ఎన్నో కుటుంబాలు నవనాగరిక ప్రపంచంలో విచ్ఛిన్న మయ్యాయి. ఆధునికత పెరగడం, నాగరికత పురోభివృద్ధి, శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం వెరసి ఉమ్మడి వ్యవస్థ మీద తీవ్ర ప్రభావాన్ని చూపింది. నవ నాగరిక ప్రపంచంలో రెండు కుటుంబాలు కాదు కదా రెండు మనసులు కూడా కలసి జీవించ లేని పరిస్థితి నెలకొంది. డబ్బు సంపాదన కోసం కనీసం భార్యభర్తలు కూడా ఒక చోట కూర్చుని ఒకరినొకరు పలకరించుకునే సమయం చిక్కడం లేదంటే మన కుటుంబాలు ఎంతగా విచ్ఛిన్న మయ్యాయో అర్థం చేసుకోవచ్చు. ఉమ్మడి కుటుంబాలలో కలిసి మెలిసి మనగలిగే మనస్తత్వాలు లోపించి పెళ్లయిన మరునాడే వేరు కాపురాలు పెట్టుకుని జంటలుగా ఒంటరై పోతున్నారు. దీంతో సలహాలిచ్చే పెద్ద దిక్కులు లేకపోవడం, ఆపదలో ఆదుకునే ఆత్మీయులు దూరం కావడం, కనీసం మనసులోని బాధలను పంచుకునే బంధువులు కరువవ్వడం నేటి సమాజంలో మనకు నిత్యం కనిపించే దృశ్యం.

# థైరాయిడ్ రుగ్మతల భారతావని...!



25 మే 1965న ఏర్పడిన 'యూరోపియన్ థైరాయిడ్ అసోసియేషన్'కు గుర్తుగా ప్రతి ఏటా 25 మే రోజున 'ప్రపంచ థైరాయిడ్ దినం' నిర్వహిస్తూ, థైరాయిడ్ రుగ్మతలకు గల కారణాలను, నివారణ మార్గాలను, తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించడం జరుగుతున్నది. 25 నుంచి 31 మే వరకు ప్రతి ఏట 'అంతర్జాతీయ థైరాయిడ్ అవగాహన వారం' కూడా నిర్వహించడం అనవాయితీగా మారింది. 25 మే 2008 నుండి ప్రారంభమైన ప్రపంచ థైరాయిడ్ దినం వేదికగా థైరాయిడ్ రుగ్మతలు, జాగ్రత్తల పట్ల ప్రజల్లో అవగాహన కోసం ప్రసార మాధ్యమాలు, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా, సామాజిక మాధ్యమ వేదికలు, సభలు, సమావేశాలు, చర్చలు, విద్యాలయాల్లో పోటీలు లాంటి కార్యక్రమాలను నిర్వహిస్తారు. సీతాకోక చిలుక ఆకారంలో ఉన్న థైరాయిడ్ వినాళ గ్రంథి మానవ మెడ కింది భాగంలో ఉంటుంది. ఎండోక్రైన్ వ్యవస్థలో భాగమైన థైరాయిడ్ గ్రంధిలో రెండు రెక్కల్లాంటి ఆకారాలను 'లోబ్స్ అని, వాటిని కలిపే కణజాలాన్ని 'థైరాయిడ్ ఇస్తుమన్' అని అంటారు. శరీరంలో జరిగే జీవక్రియలను నియంత్రించే 64 (థైరాక్సిన్), టి3 (ట్రై అయొడోథైరోనిన్) మరియు పెప్టైడ్ హార్మోన్ అనబడే కాల్సిటోనిన్ హార్మోన్లను స్రవిస్తుంది. థైరాయిడ్ హార్మోన్లతో సక్రమ జీవ క్రియ రేటు, గుండె పనితనం, మహిళల్లో రుతు చక్ర నియంత్రణ, కండర మరియు జీర్ణ క్రియ విధులు, మెదడు అభివృద్ధి, ఎముకల పటిష్టత, ప్రోటీన్ సంశ్లేషణం, పిల్లల శారీరక అభివృద్ధి లాంటి ముఖ్య విధులను నిర్వహిస్తాయి. మెదడు కింది భాగాన ఉన్న పిట్యూటరీ గ్లాండ్ స్రవించే క్రియాశీలత ఆధారపడి ఉంటుంది.

# హమాస్ చెరలో ఇజ్రాయెల్ మహిళా సైనికులు....!



హమాస్ మిలిటెంట్లు గతేడాది అక్టోబర్ 7న ఇజ్రాయెల్‌పై మెరుపు దాడి చేశారు. ఈ దాడిలో 1200 మంది ఇజ్రాయెల్ పౌరులు మరణించగా.. హమాస్ మిలిటెంట్లు 250 ఇజ్రాయల్ పౌరులను బంధీలుగా తీసుకువెళ్లారు. అయితే దాడి అనంతరం హమాస్ మిలిటెంట్లు సరిహద్దులో ఉన్న ఐదుగురు ఇజ్రాయల్ మహిళా సైనికులను బంధీలుగా తీసుకువెళ్లినట్లు తెలుస్తోంది. తాజాగా దీనికి సంబంధించిన ఓ వీడియోను 'బంధీల కుటుంబ ఫోరం' విడుదల చేసింది. ఆ వీడియోలో నహల్ ఓజ్ బేస్ వద్ద విధులు నిర్వహిస్తున్న ఇజ్రాయెల్ మహిళా సైనికులు.. లిరి అల్బాగ్, కరీనా అరివ్, అగామ్ బెర్గర్, డానియెల్లా గిల్బోవా, నామా లెవీ తెలుస్తోంది. మహిళా సైనికులు గాయాలతో, వారి చేతులు కట్టేసి ఉండటం ఆ వీడియో దృశ్యాల్లో కనిపిస్తోంది. అందులో ఒక హమాస్ మిలిటెంట్.. ఇజ్రాయెల్ మహిళా సైనికులను ఉద్దేశిస్తూ మీరంతా అమ్మాయిలు, మహిళలు. మీరు గర్భవతులు అవుతారు'అని అన్నాడు. మరో మిలిటెంట్ 'నువ్వు ఎంతో అందంగా ఉన్నావు'అని అన్నాడు. అందులో ఓ సైనికురాలు మాట్లాడుతూ.. 'నాకు పాలస్తీనాలో స్నేహితులు ఉన్నారు'అని అన్నారు. దీంతో వెంటనే స్పందించిన ఓ మిలిటెంట్.. ' మా సోదరులు ప్రాణాలు కోల్పోడానికి కారణం? మీరే. మిమ్మల్ని మేము కాల్చేస్తాం'అని అన్నాడు. ఈ వీడియోను విడుదల చేసిన 'బంధీల కుటుంబ ఫోరం' హమాస్ చెరలో ఉన్న బంధీలను వెంటెనే విడిపించాలని ప్రధాని బెంజమిన్ నెతన్యాహును డిమాండ్ చేస్తున్నారు. ఇజ్రాయెల్ మహిళా సైనికులు ఇంకా హమాస్ చెరలోనే ఉన్నారు. వారిలో చెరలో ఉన్న బంధీలను స్వదేశానికి రప్పించటంలో ఇజ్రాయెల్‌కు మద్దతుగా నిలవండని ప్రభుత్వ అధికార ప్రతినిధి డేవిడ్ మెన్సెర్ అన్నారు. ఇక.. ఈ వీడియోపై హమాస్ మిలిటెంట్లు స్పందించారు. 'ఇజ్రాయెల్ విడుదల చేసిన వీడియో నిజం కాదు. ఇజ్రాయెల్ కల్పిత కథనాల ప్రచారం. మహిళా సైనికులతో తప్పుగా ప్రవర్తించలేదు'అని వివరణ ఇచ్చారు.

## ఊహాగానాలకు చెక్.. జూలై 4ను ఖరారు చేసిన బ్రిటన్ ప్రధాని రిషి సునక్



బ్రిటీష్ ప్రధాని రిషి సునక్ ముందస్తు సార్వత్రిక ఎన్నికలను పిలుపునిచ్చారు. జూలై 4న అందరూ ఓటేసేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. అతని పాలక పార్టీ కన్జర్వేటివ్ 14 సంవత్సరాల అధికారంలో ఉన్న తర్వాత ప్రతిపక్ష లేబర్ పార్టీ చేతిలో ఓడిపోతారని వాదనలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రధాని ఎప్పుడు ఎన్నికలకు పిలుపునిస్తాడోనని నెలల ఊహాగానాలకు బుధవారం (మే 22) రోజున ముగింపు పలికారు. డౌనింగ్ స్ట్రీట్ కార్యాలయం వెలుపల నిలబడి.. కొందరు ఊహించిన దాని కంటే ముందుగానే ఎన్నికలకు పిలుపునిస్తున్నట్లు ప్రకటించారు. 'బ్రిటన్ తన భవిష్యత్ ను ఎంచుకునేందుకు సమయం ఆసన్నమైంది' అని అతను చెప్పాడు. ఈ ఎన్నికల్లో లేబర్ పార్టీ కంటే సునక్ పార్టీ వెనుకబడి ఉండడమే కాకుండా తన పార్టీలో కొందరి నుంచి వ్యతిరేకతను ఎదుర్కొంటున్నాడు. సునక్ రెండేళ్ల కిందటే బాధ్యతలు స్వీకరించారు. అప్పటి నుంచి అతను దేని కోసం ప్రధాని అయ్యానోనని చెప్పడంలో చాలా కష్టపడ్డాడు. అతని విజయాలను ప్రచారం చేసుకోవడంలో విఫలం అయ్యాడు. బ్రిటన్ ప్రతిపక్ష లేబర్ పార్టీ నాయకుడు కైర్ స్టార్మర్ మాట్లాడుతూ.. కన్జర్వేటివ్ ప్రభుత్వం ఇన్నాళ్లు చేసిన 'గందరగోళాన్ని' అంతం చేసేందుకు ఈ ఎన్నికలు అవకాశం కల్పిస్తాయని అన్నారు. 'సునక్ ఏం చెప్పినా, చేసినా, మార్పునకు అవకాశం ఈ ఎన్నికలు' అని స్టార్మర్ మద్దతుదారులతో అన్నారు. 'లేబర్‌కి ఓటు అనేది స్థిరత్వానికి నిదర్శనం ఆర్థికంగా దేశం ఎదిగేందుకు లేబర్ పార్టీకి ఓటు వేటు వేయండి' అని ఆయన కోరారు. బ్రిటీష్ ఎన్నికలు కనీసం ప్రతి ఐదేళ్లకు ఒకసారి జరగాలి.

## తైవాన్ చుట్టూ మోహరించిన చైనా...




**బీజింగ్ :** తైవాన్, చైనా మధ్య మరోసారి ఉద్రిక్తతలు భగ్గుమన్నాయి. తైవాన్ నూతన అధ్యక్షుడు లాయ్ చింగ్-తె సోమవారం బాధ్యతలు స్వీకరిస్తూ చేసిన ప్రసంగంలో తమను బెదిరించడం ఆపాలంటూ డ్రాగన్‌ను ఉద్దేశించి ఘాటుగా వ్యాఖ్యలు చేశారు. ఇవి చైనాకు ఆగ్రహం తెప్పించాయి. ఇందుకు శిక్షగా తాము తైవాన్ చుట్టూ భారీ ఎత్తున సైనిక విన్యాసాలు చేపడుతున్నట్లు ప్రకటించింది. గురువారం ఉదయం 7.45 గంటల ప్రాంతంలో ఈ ద్వీపం చుట్టూ పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ(పీఎల్ఏ)కి చెందిన ఈస్టర్న్ థియేటర్ కమాండ్ మిలటరీ విన్యాసాలు ప్రారంభించింది. ''స్వాతంత్ర్యం కోరుతున్న వేర్పాటువాద శక్తులకు ఇది బలమైన శిక్ష. మమ్మల్ని రెచ్చగొడుతూ, మా అంతర్గత విషయాల్లో జోక్యం చేసుకొనే బాహ్య శక్తులకు ఇది మా తీవ్ర హెచ్చరిక'' అని కమాండ్ అధికార ప్రతినిధి లి షీ తెలిపారు. తైవాన్ జలసంధితో పాటు ఈ ద్వీపం మిగిలిన మూడు దిక్కుల్లో డ్రాగన్ రెండు రోజుల పాటు ఈ విన్యాసాలు కొనసాగించనుంది. ఆర్మీ, నేవీ, వాయుసేన, రాకెట్ దళాలు సంయుక్తంగా ఇందులో పాల్గొన్నాయి. చైనా విన్యాసాల నేపథ్యంలో తైవాన్ అప్రమత్తమైంది. పరిస్థితులు తీవ్రంగా మారితే తక్షణమే ప్రతిస్పందించేందుకు వీలుగా యుద్ధ విమానాలను, క్షిపణులను సిద్ధంగా ఉంచింది. నేవీ, ఆర్మీ యూనిట్లను అలర్ట్ చేసింది. చైనా విన్యాసాలను తైవాన్ రక్షణ శాఖ తీవ్రంగా ఖండించింది.

## ఎంపి పదవికి రాజీనామా చేయను...




న్యూఢిల్లీ : రాజ్యసభ పదవికి రాజీనామా చేసే ప్రసక్తే లేదని ఆమ్ ఆద్మీ పార్టీ రాజ్యసభ ఎంపి స్వాతి మలివాల్ స్పష్టం చేశారు. లోక్‌సభ ఎన్నికల సమయంలో.. ఢిల్లీలో స్వాతి మలివాల్ పై దాడి వ్యవహారం దేశ రాజకీయాల్లో సంచలనంగా మారింది. ఈ నెల 13వ తేదీన సిఎం నివాసంలో కేజ్రీవాల్ వ్యక్తిగత సహాయకుడు బిభవ్ కుమార్ తనపై దాడి చేశాడని స్వాతి మలివాల్ ఆరోపిస్తున్న సంగతి తెలిసిందే. ఈ కేసులో బిభవ్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. అయితే, ఈ వ్యవహారంతో రాజ్యసభ పదవిని వదులుకోవాలంటూ స్వాతిపై ఒత్తిడి పెరుగుతున్నట్లు వార్తలు వస్తున్నాయి. ముఖ్యంగా ఓ లాయర్ కోసం స్వాతిని రాజీనామా చేయాల్సిందిగా ఆప్ నేతలు ఒత్తిడి తెస్తున్నారంటూ %ా% జాతీయ మీడియాలో కథనాలు వస్తున్నాయి. ఈ వార్తలన్నిటిపై తాజాగా స్వాతి మలివాల్ స్పందించారు. తాను ఎంపి పదవికి రాజీనామా చేసే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. గురువారం మీడియాతో మాట్లాడిన స్వాతి.. 'ఎంపీ సీటు కావాలంటే నన్ను అడిగి ఉండాల్సింది. కావాలంటే నా ప్రాణాలైనా ఇచ్చేసేదాన్ని. ఎంపీ సీటు చాలా చిన్న విషయం. నేను ఏ రోజూ పదవుల కోసం ఆశపడలేదు. పార్టీ కోరితే రాజ్యసభకు సంతోషంగా రాజీనామా చేసేదాన్ని. ఇప్పుడు రాజీనామా చేయను. వారు నా క్యారెక్టర్‌ను కించపర్చారు. బిజెపి ఏజెంట్‌గా ముద్రవేశారు. నేను ఇప్పుడు ఎంపీ పదవి నుంచి తప్పుకోను మరింత కష్టపడి పనిచేస్తా' అని స్వాతి తేల్చి చెప్పారు. 2006లో నేను ఎవరికీ తెలియనప్పుడు ఈ వ్యక్తులతో కలిసి పనిచేశాను. ఇంజినీరింగ్ జాబ్ వదులుకుని మరీ వీళ్లతో చేరాను. అప్పట్లో ముగ్గురం మాత్రమే ఉండేవాళ్లం. అప్పటి నుంచి ఎలాంటి పదవులూ ఆశించకుండా పనిచేశా. క్షేత్రస్థాయిలో కూడా పని చేశా. ఇన్నేళ్లల్లో అనేక కార్యక్రమాలు నిర్వహించా. ఏ పదవీ లేకపోయినా నేను పని చేయగలను. ఇప్పుడు నేను రాజీనామా చేయను ' అని స్వాతి స్పష్టం చేశారు.

## ఐఐటి విద్యార్థుల్లో 38 శాతం నిరుద్యోగులే



**న్యూఢిల్లీ :** దేశంలో విద్యా సంస్థల్లో ఐఐటిలకు ప్రత్యేక స్థానం ఉంది. ఐఐటిల్లో చదివిన వారికి మంచి ఉద్యోగాలు, లక్షల్లో వేతనాలు ఉంటాయని వింటుంటాం. కానీ, ప్రస్తుతం అందుకు భిన్నమైన పరిస్థితులు వెలుగుచూస్తున్నాయి. దేశంలోని వివిధ ఐఐటిల్లో విద్యనభ్యసించిన విద్యార్థుల్లో ఈ ఏడాది దాదాపు 38 శాతం మందికి క్యాంపస్ ఉద్యోగాలు దక్కలేదు. దేశంలో 61 శాతం పోస్ట్ గ్రాడ్యుయేట్లకు ఉద్యోగాలు దక్కలేదు. ఐఐటి కాన్పూర్ పూర్వ విద్యార్థి ధీరజ్సింగ్ సమాచార హక్కు చట్టం (ఆర్‌టిఐ) ద్వారా సేకరించిన సమాచారంలో పలు ఆసక్తికర అంశాలు వెల్లడయ్యాయి. ఈ ఏడాది మొత్తం 23 ఐఐటి క్యాంపస్‌ల్లో దాదాపు 8 వేల మంది (38శాతం) ఐఐటి విద్యార్థులకు ఉద్యోగాలు దక్కలేదని తేలింది. 2024లో 21,500 మంది విద్యార్థులు ఉద్యోగాలు కోసం నమోదు చేసుకోగా, కేవలం 13,400 మంది మాత్రమే ఉద్యోగాలు సాధించారు. మిగతా వారు (38 శాతం) ఇంకా కొలువుల కోసం అన్వేషిస్తున్నట్లు వెల్లడైంది. రెండేళ్ల క్రితం నాటితో పోలిస్తే ఈ పరిస్థితి దాదాపు రెట్టింపు అయినట్లు ఈ గణాంకాలు సూచిస్తున్నాయి. పాత తొమ్మిది ఐఐటిల్లో ఈ ఏడాది 16,400 మంది విద్యార్థులు ఉద్యోగాల కోసం నమోదు చేసుకోగా, వారిలో 6,050 (37 శాతం) మందికి ఇంకా ఉద్యోగాలు దక్కలేదు. కొత్త 14 ఐఐటిల్లో అయితే ఈ పరిస్థితి మరింత క్షీణించింది. 5,100 మంది ఉద్యోగాలు కోసం నమోదు చేసుకోగా, ఇంకా 2,040 మందికి కొలువులు రాలేదని తేలింది. గతేడాది ఖరగ్‌పూర్ ఐఐటిల్లో 33 శాతం మంది విద్యార్థులకు ఉద్యోగాలు దక్కలేదని ధీరజ్ సింగ్ పేర్కొన్నారు. ఉద్యోగ నియామకాల్లో సంక్షోభ పరిస్థితుల కారణంగా ఇంకా ఉద్యోగాలు రాని విద్యార్థులు ఒత్తిడి, ఆందోళన, నిస్సహాయతతో ఉన్నారని ఆయన తెలిపారు. ''ఉద్యోగాలురాని విద్యార్థుల సంఖ్య రెట్టింపు కావడం దేశంలోని అత్యుత్తమ ఇంజినీరింగ్ కళాశాలల్లో అనిశ్చిత స్థితిని సూచిస్తుంది. దాదాపు 61 శాతం పోస్ట్‌గ్రాడ్యుయేట్‌లు ఇప్పటికీ చోటు చేసుకోలేదు. ఇది ప్రధాన కళాశాలలు, యువ గ్రాడ్యుయేట్లు ఎదుర్కొంటున్న ఎన్నడూ లేని విధంగా ఉద్యోగ సంక్షోభం నెలకొంది'' అని ధీరజ్ సింగ్ తెలిపారు.

## 'ఓటింగ్ డేటా' పిటిషన్‌ను తిరస్కరించిన సుప్రీంకోర్టు



న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికల సమయంలో పోలింగ్ కేంద్రాల వారీగా ఓటింగ్ డేటాను తన వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని ఎన్నికల కమిషన్‌కు ఆదేశాలు జారీ చేయాలంటూ ఎన్జీవో చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు శుక్రవారం తిరస్కరించింది. పోల్ ప్యానెల్‌కు జన సమీకరించడం కష్టమని పేర్కొంది. ఐదు దశల పోలింగ్ ముగియగా, రెండు దశలు మిగిలి ఉన్నందున ప్రస్తుతం అలాంటి ఆదేశాలు జారీ చేయలేమని జస్టిస్ దీపాంకర్ దత్తా, సతీష్ చంద్ర శర్మలతో కూడిన వెకేషన్ బెంచ్ పేర్కొంది. పోల్ ప్యానెల్ తన వెబ్‌సైట్‌లో ఓటరు ఓటింగ్ డేటాను అప్‌లోడ్ చేయడానికి మానవ వనరులు సమీకరించడం కష్టమని బెంచ్ పేర్కొంది. ప్రతి దశ పోలింగ్ ముగిసిన 48 గంటల్లోగా పోలింగ్ స్టేషన్ల వారీగా ఓటరు ఓటింగ్ వివరాలను వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసేలా ఆదేశాలివ్వాలని కోరుతూ మే 17న.. ఎన్జీవో చేసిన పిటిషన్‌పై వారంలోగా స్పందన ఇవ్వాలని ఎన్నికల కమిషన్‌ను సుప్రీంకోర్టు కోరిన విషయం విదితమే.

## భ్రమల్లో - భ్రాంతుల్లో బతుకులు....!

స్కిజోఫ్రెనియా ఒక అత్యంత తీవ్రమైన మానసిక రుగ్మత, దీనిలో ప్రజలు వాస్తవికతను అసాధారణంగా, తప్పుగా అర్థం చేసుకుంటారు. ఇది భ్రాంతులు, భ్రమలు, చాలా అస్తవ్యస్తమైన ఆలోచనలు, ప్రవర్తనల కలయికకు దారితీయవచ్చు..ఫలితంగా చాలా మంది రోగుల రోజువారీ పనితీరును దెబ్బతీస్తుంది. 'లాన్సెట్' అధ్యయనం ప్రకారం 2017 లో ఏడుగురు భారతీయుల్లో ఒకరు వివిధ రకాలైన మానసిక రుగ్మతలతో బాధపడుతున్నారని తెలిపింది. సాధారణంగా మానసిక వ్యాధుల చుట్టూ ఉన్న మూఢనమ్మకాలు నిర్మించే ప్రయత్నంలో భాగంగా మే 24ను ప్రపంచ స్కిజోఫ్రెనియా దినోత్సవంగా ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకటించింది. 1910లో స్విస్ మనోరోగ వైద్యుడు డాక్టర్. పాల్ యూజెన్ బ్ల్యూలర్ దీనికి స్కిజోఫ్రెనియాగా నామకరణం చేశాడు.. ప్రపంచవ్యాప్తంగా 1 నుండి 2 శాతం మంది ఈ జబ్బుతో బాధపడుతున్నారని అంచనా. స్కిజోఫ్రెనియా అంటే మనస్సు విభజన అని అర్థం. కానీ స్కిజోఫ్రెనియా చుట్టూ ఉన్న ఒక సాధారణ అపోహ ఏమిటంటే, దానితో బాధపడుతున్న వ్యక్తులు స్ప్లిట్ పర్సనాలిటీ కలిగి ఉంటారని. ఇది పూర్తిగా అవాస్తవం. స్కిజోఫ్రెనియా రోగులకు అందరిలాగే ఒకే వ్యక్తిత్వం ఉంటుంది. స్కిజోఫ్రెనియా యుక్తవయస్సు ప్రారంభంలో లేదా కౌమారదశలో మొదలవుతుంది. స్త్రీల కంటే పురుషులు ఈ జబ్బుతో బాధపడే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. పురుషులలో, స్కిజోఫ్రెనియా లక్షణాలు ఇంచుమించుగా తన 20వ సంవత్సరంలో.. అదే మహిళల్లోనైతే తన 20వ సంవత్సరం చివరిలో ప్రారంభమవుతాయి. స్కిజోఫ్రెనియా కారణమేమిటో తెలియదు, కానీ అనువంశికత , మెదడులోని రసాయన పదార్థాల అసమతుల్యత, సామాజిక పర్యావరణం మార్పుల కలయికలు రుగ్మత అభివృద్ధికి దోహదం చేస్తుందని పరిశోధకులు, వైద్యులు విశ్వసిస్తున్నారు. డోపమైన్, గ్లుటామేట్ అని పిలువబడే న్యూరోట్రాన్స్మిటర్లతో సహా కొన్ని సహజంగా సంభవించే మెదడు రసాయనాలతో సమస్యలు స్కిజోఫ్రెనియాకు దోహదం చేస్తాయి. స్కిజోఫ్రెనియా అనేది మెదడు వ్యాధిగా చాలా మంది సూచిస్తున్నారు. స్కిజోఫ్రెనియా ఆలోచన (జ్ఞానం), ప్రవర్తన భావోద్వేగాలతో అనేక రకాల సమస్యలను కలిగి ఉంటుంది. సంకేతాలు, లక్షణాలు మారవచ్చు, కానీ సాధారణంగా భ్రమలు భ్రాంతులు లేదా అస్తవ్యస్తమైన ప్రసంగాన్ని కలిగి ఉంటాయి. పనితీరులో బలహీనమైన సామర్థ్యాన్ని ప్రతిబింబిస్తాయి. వీరు తనగూర్చి ఎవరో మాట్లాడుతున్నారని, తనను చూస్తూ నవ్వుతున్నారని, అవహేళనగా మాట్లాడుతున్నారని, పేపర్‌లో, టీవీల్లో తన గురించే వార్తలు వస్తున్నాయని, ఎవరో వెంబడిస్తున్నారని, చంపడానికి వస్తున్నారని, తన మీద నిఘా పెట్టారని, తనకు హాని లేదా వేధింపులకు గురి చేస్తున్నారని, కొన్ని సందర్భాల్లో తనకు అసాధారణమైన సామర్థ్యం లేదా కీర్తి ఉందనీ, లేదా పెను విపత్తు జరగబోతుందని ఆధారం లేకుండా భ్రమపడతారు, వీళ్లకు ఆధారాలు చూపించినప్పటికి, ఎట్టి పరిస్థితుల్లో నమ్మక, వాళ్ళే కరెక్ట్ అనుకుని మొండిగా కఠినంగా ప్రవర్తిస్తుంటారు. భ్రాంతులు కూడా ఇంతే .. మనస్సు లోపల లేదా వెలుపల నుండి శబ్దాలు వస్తున్నట్లు భ్రాంతి చెందడం, ఘ్రాణ భ్రాంతులు- చుట్టూ ఏదో వాసన వస్తోందని లేదా సొంత శరీరం నుండి వస్తోందని అనుకోవచ్చు, గస్టేటరీ హాలూసినేషన్- తినే లేదా తాగేదానికి బేసి రుచి ఉందని భావించవచ్చు- స్పర్శ లేదా సోమాటిక్ భ్రాంతులు- చర్మం కింద కీటకాలు పారు తున్నట్లు అనిపించడం, స్కిజోఫ్రెనియా జీవితంలోని ప్రతి అంశాన్ని ప్రభావితం చేసే తీవ్రమైన సమస్యలకు దారి తీస్తుంది. ఉదాహరణకు..ఆత్మహత్య ప్రయత్నాలు, ఆత్మహత్య ఆలోచనలు లేదా హత్యలు, ఆందోళన రుగ్మతలు, అబ్సెసివ్-కంపల్సివ్ డిజార్డర్ (%ాజణ%), డిప్రెషన్. ఇతర మానసిక శారీరక సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉంది. స్కిజోఫ్రెనియాకు జీవితకాల చికిత్స అవసరం. లక్షణాలు తగ్గినప్పటికీ. మందులు మానసిక సామాజిక చికిత్సతో పరిస్థితిని నిర్వహించడానికి సహాయపడుతుంది. కొన్ని సందర్భాల్లో, ఆసుపత్రిలో చేరడం అవసరం కావచ్చు. స్కిజోఫ్రెనియా చికిత్సలో అనుభవం ఉన్న మానసిక వైద్యుడు సాధారణంగా చికిత్సకు మార్గనిర్దేశం చేస్తాడు. ఈ చికిత్సకు మందులు మూలస్తంభం, మందుల ద్వారా మెదడు న్యూరోట్రాన్స్మిటర్ డోపమైన్‌ను ప్రభావితం చేయడం ద్వారా వ్యాధిని అదుపులోకి తేవడం జరుగుతుంది. స్కిజోఫ్రెనియా మందులు తీవ్రమైన దుష్ప్రభావాలను కలిగిస్తాయనే అపోహ ఉంది కాబట్టి, రోగులు వాటిని తీసుకోవడానికి ఇష్టపడరు. చికిత్సతో సహకరించడానికి ఇష్టపడటం ఔషధ ఎంపికను ప్రభావితం చేయవచ్చు. కానీ నేడు దొరుకుతున్న ఆధునికమైన కొత్త రకమైన ఆంటీ సైకోటిక్‌లు ఎలాంటి దుష్ప్రభావాలు లేకుండా మంచిగా పనిచేస్తున్నాయి, మందులు తీసుకోలేని వారికి కూడా ఇంజెక్షన్ల రూపంలో వైద్య సదుపాయాలు ఉన్నాయి. సాధారణంగా మానసిక వ్యాధుల చుట్టూ ఉన్న మూఢనమ్మకాలు నిర్మించే ప్రయత్నంలో భాగంగా మే 24ను ప్రపంచ స్కిజోఫ్రేనియా దినోత్సవంగా ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకటించింది. 1910లో స్విస్ మనోరోగ వైద్యుడు డాక్టర్. పాల్ యూజెన్ బ్ల్యూలర్ దీనికి స్కిజోఫ్రెనియాగా నామకరణం చేశాడు.. ప్రపంచవ్యాప్తంగా 1 నుండి 2 శాతం మంది ఈ జబ్బుతో బాధపడుతున్నారని అంచనా. స్కిజోఫ్రెనియా అంటే మనస్సు విభజన అని అర్థం. ఉదాహరణకు..ఆత్మహత్య ప్రయత్నాలు, ఆత్మహత్య ఆలోచనలు లేదా హత్యలు, ఆందోళన రుగ్మతలు, అబ్సెసివ్-కంపల్సివ్ డిజార్డర్, డిప్రెషన్. స్కిజోఫ్రెనియాకు జీవితకాల చికిత్స అవసరం. లక్షణాలు తగ్గినప్పటికీ. మందులు మానసిక సామాజిక చికిత్సతో పరిస్థితిని నిర్వహించడానికి సహాయపడుతుంది. కొన్ని సందర్భాల్లో, ఆసుపత్రిలో చేరడం అవసరం కావచ్చు.

# చెప్పులు లేకుండా నడవడమే ట్రెండ్.....



పాటల విషయంలో, వస్తువుల విషయంలో, ఫుడ్ విషయంలో ఇలా చాలా విషయాల్లో కూడా ఓల్డ్ ఈజ్ గోల్డ్ అంటారు. ప్రస్తుతం ఎక్కడికి వెళ్లాలి అన్నా సరే ఇంటికి ఒక బైక్, లేదా కార్ వంటివి ఉన్నాయి. ఇక రోడ్డు మీద బస్ లు, రైల్వే ట్రాక్ లు, విమానాలు చాలా ఉన్నాయి. పైసామే పరమాత్మ అన్నట్టుగా డబ్బులను బట్టి లగ్జరీగా ఉండవచ్చు. కానీ పూర్వం మన భారత దేశంలో ఎవరు ఎక్కడికి వెళ్ళలనుకున్నా కాళ్లతో నడుస్తూనే వెళ్లేవారు. మరి నడవడం వల్ల ఎన్ని ప్రయోజనాలు ఉన్నాయో తెలుసా? రాను రాను నడక పూర్తిగా తగ్గిపోయింది. కేవలం వాకింగ్, జాగింగ్ చేసేవారు మాత్రం పెరిగిపోతున్నారు. అయితే వీటికోసం కూడా ఎన్నోరకాల చెప్పులు, షూస్ అందుబాటులోకి వచ్చాయి. అవసరానికి అనుగుణంగా చెప్పులు, షూలు వచ్చాక డబ్బులు పెట్టి అందమైనవి కూడా కొంటున్నారు. ఇదిలా ఉంటే కాలి నడక ఇప్పుడు కొన్ని ప్రాంతాల్లో ట్రెండ్ గా మారింది. ఒక వ్రతం లాగా దీన్ని పాటిస్తున్నారు అంటే నమ్ముతారా?. కొందరు మార్నింగ్ వాక్ కోసం కాలి నడకని ఎంచుకుంటే.. మరికొందరు చెప్పులు లేకుండా నడవాలి అని కోరుకుంటున్నారు. మన దగ్గర ఇప్పటికే ఇలా చాలా మంది అలవాటు చేసుకున్నారు. ఆరోగ్యం కోసం చాలా మంది పాత పద్ధతులనే వాడుతున్నారు. ఇందులో భాగంగా చెప్పులు లేకుండా భూమి స్పర్శను పొందడం అనేది మెల్లిమెల్లిగా మన దేశంలో చాలా మంది అలవాటు చేసుకుంటున్నారు. సామాన్య ప్రజలు మాత్రమే కాదు ప్రముఖులు కూడా ఇదే పని చేస్తున్నారు. ఇప్పుడు కొంతమంది సెలబ్రిటీలు పాదాలతో నడవడం గమనిస్తే ఈ విషయం చాలా అర్థం అవుతుంది. ఇలా ఎవరు ఎక్కడ చెప్పులు లేకుండా నడిచినా వాటి ఉపయోగాలు మాత్రం చాలా ఉన్నాయి అంటున్నారు నిపుణులు. ప్రకృతి స్పర్శను అనుభవించాలి అంటే నేలను తాకాలట. నేల తగిలేలా కాలు కింద పెట్టి భూమికి ఉన్న రకరకాల స్వభావాలు తాకుతూ ఉంటే ప్రకృతితో ఒక బంధం ఏర్పడుతుంది అంటారు ప్రకృతి ప్రియులు. కాలి నడక వల్ల భూమిలోని నెగిటివ్ ఎనర్జీ శరీరంలోకి ప్రవేశిస్తాయి. మన నిత్యం వాడే ఎలక్ట్రానిక్ పరికరాల వల్ల శరీరంలో పేర్కొన్న అయాన్లను ఇవి బ్యాలెన్స్ చేస్తాయి అంటున్నారు నిపుణులు. ఇలా బ్యాలెన్స్ అవడం వల్ల శరీరంలో ఉన్న వాపులు తగ్గుతాయట. ఇలా జరగడం వల్ల నిద్ర కూడా బాగా పడుతుందట. చెప్పులు లేకుండా నడవడం వల్ల పాదాలలో ఉండే నరాలు క్రమబద్ధంగా తాకిడికి గురై దానివల్ల ఒత్తిడి దూరమయ్యే ఛాన్స్ కూడా ఉందట. శరీరం పూర్తిగా సేద తీరిన భావన కలుగుతుంది. ఇలా నడవడం వల్ల రక్త ప్రసరణ బాగా జరుగుతుందని చాలా అధ్యయనాలు చెబుతున్నాయి. పాదంపై ఒత్తిడి పెంచడం వల్ల రక్తప్రసరణలో చురుకుతనం వస్తుంది. తద్వారా గుండె ఆరోగ్యం కూడా పదిలంగా ఉంటుంది.

## సరైన నిద్ర లేదా? మీరు డేంజర్‌లో ఉన్నట్టే..



ప్రస్తుతం చాలా మంది నిద్రలేమి సమస్యతో బాధ పడుతున్నారు. నైట్ డ్యూటీలు, రాత్రి ఫోన్ లు, పార్టీలు అంటూ నిద్ర పోకుండా మెలుకువతో ఉంటున్నారు. దీని వల్ల తర్వాత కూడా నిద్ర పట్టడం లేదు. అయితే నిద్ర లేకపోవడం వల్ల, నిద్రలేమి సమస్య సులభంగా వస్తుంది. దీని వల్ల గుండె సమస్య కూడా వస్తుంది. అంతేకాదు మానసిక, శారీరక సమస్యలు.. సహా పలు తీవ్ర వ్యాధులకు కారణం కూడా అవుతుంది.

వాస్తవానికి ఆరోగ్యంగా ఉండాలంటే.. 7 నుంచి 8 గంటలపాటు నిద్రపోవాలి.. మరి మీకు సరైనా నిద్ర లేకపోతే ఎలాంటి ప్రమాదాలు, వ్యాధులు వస్తాయో తెలుసుకోండి. ఎవరైనా 8 గంటలు నిద్రపోకపోతే, శరీరంలో కార్టిసాల్ హార్మోన్ పెరగడం ప్రారంభమవుతుంది అంటున్నారు నిపుణులు. దీంతో గుండెపై ఒత్తిడి పెరుగుతుందట. తద్వారా రక్తపోటు పెరిగి.. ఇది గుండె జబ్బులకు దారి తీస్తుంది. అంటే గుండెపోటు వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుంది. తగినంత నిద్ర లేకపోవడం వల్ల వాపు, ఒత్తిడిని పెంచే హార్మోన్లు శరీరంలో పెరుగుతాయి అంటున్నారు నిపుణులు. ఈ వాపు ధమనికి హాని కలిగిస్తుందట. దీని వల్ల కూడా గుండె జబ్బులు పెరుగుతాయట.

నిద్ర లేకపోవడం వల్ల, గుండె కొట్టుకోవడం సక్రమంగా ఉండదని.. చప్పుడులో మార్పు సంభవించే ప్రమాదం ఉంది అంటున్నారు నిపుణులు. దీనిని అరిథ్మియా అని పిలుస్తారట. ఇది గుండెపోటు, స్ట్రోక్ ప్రమాదాన్ని పెంచుతుందని.. అందుకే రాత్రి పూట వీలైనంత త్వరగా పడుకోవాలి అని సలహా ఇస్తున్నారు వైద్యులు. రాత్రి పూట మెలుకువగా ఉంటే తినడం కూడా బాగా అలవాటు అవుతుంది. దీని వల్ల ఆకలి కూడా పెరుగుతుంది. ఇలా జరగడం వల్ల తినడం, ఆ తర్వాత ఉచితంగా ఊబకాయం రావడం వంటి సమస్యలు వస్తుంటాయి. గుండె జబ్బులకు ప్రధాన కారణం అధిక బరువు.. కావున జీవనశైలిలో మార్పు చేసుకుంటే ఈ గుండె జబ్బులు కూడా తక్కువ అవుతాయి.

## ఈ ఆకులు తింటే మోకాళ్ల నొప్పులు దెబ్బకి పరార్.....!



చాలామంది ఆయుర్వేద నిపుణులు ఎక్కువగా మన చుట్టూ ఉంటే పరిసరాలలో లభించే మొక్కల ద్వారా ఎన్నో ప్రయోజనాలు ఉంటాయని వాటిని ఉపయోగిస్తూ ఉంటారు. అయితే కొన్ని మొక్కల ఆకులను తినడం వల్ల యూరిక్ యాసిడ్ వంటి సమస్యలను కూడా తగ్గించుకోవచ్చని నిపుణులు సైతం తెలియజేస్తూ ఉంటారు. అలా ఇప్పుడు మోకాళ్ళ నొప్పులతో బాధపడేటువంటి వారు కొన్ని ఆకులు తినడం వల్ల మోకాళ్ల నొప్పుల నుంచి విముక్తి పొందవచ్చు వాటి గురించి చూద్దాం. యూరిక్ యాసిడ్ వల్ల కిడ్నీల పైన తీవ్రమైన ప్రమాదం చూపిస్తుంది.. దీనివల్ల కిడ్నీలు సరిగా ఫిల్టర్ చేయలేకపోతాయట. అంతేకాకుండా పొత్తి కడుపులో నొప్పి, మోకాళ్ల నొప్పులు, జ్వరం, మూత్ర విసర్జనలు ఇబ్బందులు ఇవే యూరిక్ యాసిడ్ యొక్క లక్షణాలు వీటిని తగ్గించుకోవాలి అంటే.. తులసి చెట్టు ఆకులలో చాలా ఔషధ గుణాలు లభిస్తాయి.. తులసి ఆకులను తరచూ నమిలి తింటూ ఉండడం వల్ల రీజనల్ వ్యాధులను కూడా దరిచేరకుండా చేస్తుంది. అలాగే యూరిక్ యాసిడ్ కూడా చెక్ పెట్టవచ్చు. కొత్తిమీర ఇది మనకు ఎక్కడైనా సరే అందుబాటులో లభిస్తుంది. కొత్తిమీరలో ఎన్నో రకాల ఆరోగ్య సమస్యలని తగ్గించుకోవచ్చు. కొత్తిమీరలో ఉండే ఔషధ గుణాలు కూడా యూరిక్ యాసిడ్ని తగ్గించడానికి చాలా ఉపయోగపడతాయి.


## పుదీనాతో మొటిమలకు చెక్....



పుదీనా అనేది వేసవిలో ఎక్కువగా ఉపయోగించే ఓ ఔషధం. ఇది ఆహారంలో సువాసన, రుచిని పెంచడమే కాకుండా ఆరోగ్య పరంగా కూడా ఎన్నో ఉపయోగాలను కలిగిస్తుంది. ఇందులో ఉండే చల్లదనం కారణంగా వేసవిలో దీన్ని ఎక్కువగా ఉపయోగిస్తారు. అందుకే చాలామంది ప్రజలు ఖచ్చితంగా తమ వేసవి ఆహారంలో పుదీనాను చేర్చుకుంటారు. అయితే ఇది ఆరోగ్యంతో పాటు మన చర్మానికి కూడా మేలు చేస్తుంది. అలాగే జిడ్డుగల చర్మం లేదా తీవ్రమైన మొటిమల సమస్యలు ఉన్నవారికి పుదీనా చాలా ఉపయోగకరంగా ఉంటుంది. పుదీనాలో క్రిమినాశక లక్షణాలు కనిపిస్తాయి. అందుకే దీన్ని సబ్బు, బ్యూటీ క్రీమ్, క్లెన్సర్ వంటి చర్మ సంరక్షణ ఉత్పత్తులలో ఉపయోగిస్తారు. మీ ముఖం పై పదేపదే మొటిమలు వస్తున్నట్లయితే, మీరు పుదీనాను ఉపయోగించడం ద్వారా ఈ సమస్యకు చెక్ పెట్టవచ్చు. పుదీనాలో మెంథాల్ ఉంటుంది. ఇది శీతలీకరణ లక్షణాలను కలిగి ఉంటుంది. ఈ మూలకం మొటిమలతో సంబంధం ఉన్న ఎరుపు, వాపును తగ్గించడంలో సహాయపడుతుంది. అంతే కాకుండా చర్మం పై మొటిమలకు కారణమయ్యే బ్యాక్టీరియాతో పోరాడే యాంటీ బ్యాక్టీరియల్ లక్షణాలు పుదీనాలో ఉన్నాయి. దీనితో పాటు, ఫ్రీ రాడికల్స్‌తో పోరాడడంలో కూడా పుదీనా సహాయపడుతుంది.

మొటిమలు, దాని మచ్చలతో ఇబ్బంది పడుతుంటే, పుదీనా, పసుపును ఉపయోగించవచ్చు. 10 నుంచి 15 పుదీనా ఆకులను మిక్స్ చేసి పేస్ట్ లా తయారు చేయండి. దీని తరువాత దానికి చిటికెడు పసుపు వేసి కలపాలి. ఇప్పుడు నీళ్లతో ముఖం కడుక్కుని ప్యాక్ వేసుకోవాలి. సుమారు 15 నిమిషాల తర్వాత మీ ముఖాన్ని కడగాలి. పుదీనా, ముల్తానీ మిట్టి ఫేస్ ప్యాక్ మొటిమల మొటిమలకు కూడా చాలా ఉపయోగకరంగా ఉంటుంది. ఇది ముఖంలోని మురికిని శుభ్రపరుస్తుంది. ఈ ఫేస్ ప్యాక్ చేయడానికి, పుదీనా ఆకులను తీసుకొని దాని పేస్ట్ సిద్ధం చేయండి. ఈ పేస్ట్‌లో పెరుగు, ముల్తానీ మిట్టి వేసి కలపాలి. దీన్ని ముఖం, మెడ పై మాస్క్ లాగా అప్లై చేయండి. అది ఆరిన తర్వాత ముఖానికి మసాజ్ చేసి కడిగేయాలి.

## వేసవిలో కూడా వేడి పాలు తాగుతున్నారా?



పాలు అంటే ఇష్టపడని వారు ఎవరు ఉంటారు. చాలా మంది ఉదయం లేవగానే పాలు తాగుతుంటారు. ఇందులో చాలా పోషకాలు ఉంటాయి కూడా. పాలు తాగడం వల్ల ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు కూడా ఉన్నాయి. ముఖ్యంగా పాలు తాగడం వల్ల ఎముకలకు బలం అంటారు నిపుణులు. ఇందులో ఉండే కాల్షియమే దీనికి ప్రధాన కారణం. అయితే వేసవిలో పాలు తాగితే వేడి అంటారు కొందరు. అందుకే వేసవి లో పాలు తాగడమే మానేస్తుంటారు. ఇంతకీ ఎండాకాలంలో పాలు తాగవచ్చా లేదా? అనే వివరాలు ఇప్పుడు తెలుసుకుందాం. పాల వల్ల అసిడిటీ కలుగుతుందట. అందుకే ఖాళీ కడుపున పాలు తాగవద్దు అంటారు నిపుణులు. ఖాళీ కడుపుతో పాలు తాగాలి అనుకుంటే ఖచ్చితంగా దానితో ఏదైనా నట్స్ తినండి. దీని వల్ల మీ కండరాలను బలంగా మారుతాయి. ఇక వేసవిలో, చల్లని పాలు తాగడం అలవాటు చేసుకోండి. ఎందుకంటే వేడి పాలు తాగడం వల్ల కడుపు సంబంధిత సమస్యలు వస్తాయి అంటున్నారు నిపుణులు. అందుకే వేసవిలో వేడి పాలకు బదులుగా చల్లని పాలు అలవాటు చేసుకోవాలి. పాలలో ఉండే అమినో యాసిడ్లు సెరోటోనిన్ , మెలటోనిన్‌లను నియంత్రించి నిద్ర పోయేలా చేస్తాయి పాలు. దీని వల్ల శరీరం చల్లగా ఉంటుంది. ఇక చలికాలంలో గోరువెచ్చని పాలు తాగవచ్చు. ఇక చాలా మంది వ్యాయామం, వర్కౌట్లు చేసిన తర్వాత లేదంటే ముందు పాలు తాగుతుంటారు. ఇలా చేయవద్దు అంటున్నారు నిపుణులు. అలా కాకుండా వ్యాయామం పూర్తైన అరగంట తర్వాత మాత్రమే పాలు తాగాలట. దీంతో శరీరానికి పోషకాలు అందుతాయి. జలుబు లేదా ఫ్లూ వంటి సమస్యలు ఉంటే చల్లని పాలు తాగకుండా గోరువెచ్చని, వేడి పాలు తాగాలి. దీంతో మీరు గొంతు నొప్పి నుండి ఉపశమనం పొందుతారు. కొందరికి పడుకునే ముందు పాలు తాగే అలవాటు ఉంటుంది. అయితే చలికాలంలో మాత్రం గోరువెచ్చిన పాలనే తాగాలి. ఇది శరీరాన్ని వెచ్చగా ఉంచడంలో సహాయం చేస్తుంది. చలి నుండి రక్షిస్తుంది. వేడి పాలు జీర్ణ సమస్యలు, కడుపు నొప్పి, గ్యాస్ నుంచి దూరంగా ఉంచుతాయి. నిద్రలేమి ఉంటే, రాత్రిపూట గోరువెచ్చని పాలు తీసుకోవడం వల్ల నిద్ర వస్తుందట. పాలలో ఉండే అమినో యాసిడ్లు సెరోటోనిన్ , మెలటోనిన్‌లను నియంత్రించి నిద్ర పోయేలా చేస్తాయి పాలు.

## ఆపిల్స్ తీసుకునేటప్పుడు జాగ్రత్త.....!



ఆరోగ్యంగా ఉండాలంటే రోజుకు ఒక ఆపిల్ తినాలి అంటారు నిపుణులు. దీనిలో చాలా పోషకాలు ఉంటాయి. కొందరు ఏకంగా వీటిని బ్రేక్‌ఫాస్ట్‌లో తింటారు. ఆపిల్స్ లో ఎక్కువగా ఫైబర్, విటమిన్స్ ఉంటాయి. ఇవి శరీరాన్ని ఎన్నో సమస్యల నుంచి కాపాడుతుంటాయి. అంతేకాదు రోగనిరోధక శక్తిని కూడా పెంచుతాయి. కానీ ఆపిల్స్ కదా అని ఏవి పడితే అవి తినకూడదు. చూసి మంచివి తీసుకోవాలి. సరైనవి తింటేనే ఆరోగ్యానికి చాలా మంచిది. ఇంతకీ మంచి వాటిని ఎలా గుర్తించాలో తెలుసా? ఓ సారి చూసేయండి..రుచికరమైన ఆపిల్స్ తినాలి అనిపిస్తే కొనేటప్పుడు అవి చిన్న పరిమాణంలో, సాధారణ బరువు ఉండేలా చూడండి. ఎందుకంటే, పెద్దగా ఉండే యాపిల్స్ త్వరగా చెడిపోయే అవకాశం ఉంటుంది. అదే విధంగా, ఎక్కువగా బరువుగా ఉండే ఆపిల్స్ కూడా మంచివి కాదంటారు నిపుణులు. ఆపిల్స్ సాధారణంగా ఎరుపు, లేత పసుపు, ఆకుపచ్చ రంగుల్లో లభిస్తుంటాయి. చాలా మంది రెడ్ కలర్ ఆపిల్స్‌కి అట్రాక్ట్ అవుతుంటారు. కానీ, లేత ఎరుపు, ఆకపచ్చ, మిక్స్ కలర్ ఆపిల్స్ రెడ్ కలర్ ఆపిల్స్ కంటే తియ్యగా, రుచిగా ఉంటాయి కాబట్టి వీటికే ఎక్కువ ఓటు వేస్తారు. ఆకుపచ్చ ఆపిల్స్ పచ్చిగా ఉండటమే కాదు కాస్తా పుల్లగా కూడా ఉంటాయి. పసుపు రంగులో ఉండే ఆపిల్స్ తియ్యగా ఉంటాయి. జ్యూస్ కు కూడా ఇవి బాగుంటాయి. వాసన చూడటం వల్ల కూడా ఆపిల్స్ బాగున్నాయో లేదో తెలుసుకోవచ్చు. స్వీట్ ఆపిల్ అయితే మంచి వాసన వస్తుంది అంటారు నిపుణులు.

## పొట్టని క్లీన్ చేసే హెల్తీ జ్యూస్లు......




పొట్ట ఆరోగ్యం చాలా ముఖ్యం. పొట్ట ఆరోగ్యంగా ఉంటే ఎలాంటి సమస్యలు రావు. పొట్ట ఆరోగ్యంగా ఉండాలంటే ఖచ్చితంగా కొన్ని హెల్తీ జ్యూస్ లు తాగాలి. ఇది అనేక రకాల పనులను నిర్వర్తిస్తుంది. పిత్త రసాన్ని ఉత్పత్తి చేస్తుంది. రక్తాన్ని శుభ్ర పరుస్తుంది. అవేంటో ఇప్పుడు మనం తెలుసుకుందాం. పాలకూరలో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇవి లివర్‌ను డిటాక్సిఫై చేస్తాయి. యాంటీ ఆక్సిడెంట్లు లివర్‌ను కాపాడుతాయి. అలాగే శరీరాన్ని శుభ్ర పరుస్తాయి. కనుక రోజూ పాలకూర జ్యూస్‌ను కూడా తాగవచ్చు. అయితే ఇందులో నిమ్మరసం కలిపి తాగాల్సి ఉంటుంది. ఇక రోజూ నెయ్యిని తీసుకుంటున్నా కూడా లివర్ శుభ్రంగా మారుతుంది. నెయ్యిలో యాంటీ ఇన్‌ఫ్లామేటరీ లక్షణాలు ఉంటాయి. అందువల్ల లివర్ వాపులకు గురి కాకుండా చూస్తాయి. లివర్‌ను ఆరోగ్యంగా ఉంచుతాయి. క్యారెట్ జ్యూస్ లివర్‌కు చాలా మేలు చేస్తుంది. క్యారెట్లలో బీటా కెరోటిన్ ఉంటుంది. ఇది మన శరీరంలో విటమిన్ ఎ గా మారుతుంది. ఇది లివర్‌కు ఉపయోగకరంగా ఉంటుంది. ఇది లివర్‌ను దెబ్బ తినకుండా చూస్తుంది. జీర్ణక్రియను మెరుగు పరుస్తుంది. శరీరాన్ని డిటాక్సిఫై చేస్తుంది. ఇక బీట్‌రూట్ జ్యూస్‌ను తాగినా కూడా లివర్ ఆరోగ్యంగా మారుతుంది. ఇందులో పొటాషియం, ఫైబర్, మాంగనీస్, విటమిన్ ఎ, సి ఉంటాయి. బీట్‌రూట్‌లో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు రక్తాన్ని శుభ్రం చేస్తాయి. లివర్‌ను ఆరోగ్యంగా ఉంచుతాయి. కనుక రోజూ బీట్‌రూట్ జ్యూస్‌ను తాగినా కూడా లివర్ శుభ్రంగా ఉంటుంది.

## హాట్ అందాలతో కుర్రకారును హీటెక్కిస్తున్న....

# మానుషి చిల్లర్

మాజీ ప్రపంచ సుందరి, బాలీవుడ్ నటి మానుషి చిల్లార్ అనేక ప్రతిభ కలిగిన మహిళ. ఆమె ఇటీవల ఫ్యాషన్ యొక్క వ్యవస్థాపక ప్రపంచంలోకి ప్రవేశించినందున నటి ఇప్పుడు తన సార్టోరియల్ సెన్సిబిలిటీలను ఎక్కువగా ఉపయోగించుకుంది. నటి ద్వీప్ అనే కొత్త స్విమ్‌వేర్ బ్రాండ్‌ను ప్రారంభించింది. సస్టైనబుల్ స్విమ్‌వేర్ బ్రాండ్ యొక్క అధికారిక పేజీ వీడియోను షేర్ చేసింది, ఇది మాకు సేకరణ యొక్క సంగ్రహావలోకనం ఇచ్చింది. నియాన్ బికినీ సెట్ ధరించిన మోడల్‌తో క్లిప్ ఓపెన్ అవుతుంది. టూ-పీస్ నంబర్‌లో రీఫ్ రఫిల్ బికినీ టాప్ ఉంది, ఇది టైడల్‌రైజ్ హై వెయిస్ట్ బికినీ బాటమ్స్‌తో జత చేయబడింది. తర్వాత, ముందు జిప్పర్‌తో నిమ్మకాయ-పసుపు రంగు మోనోకినిని ధరించిన మోడల్‌ను మేము చూశాము. మోనోకిని ఒక స్కూప్ నెక్‌లైన్‌ను కలిగి ఉంది, ఇది విస్తృత పట్టీలతో కలిసి ఉంటుంది. మల్టిపుల్ కలర్స్ మరియు ప్యాటర్న్‌లతో, వేసవికి పర్ఫెక్ట్ అనిపించే కలెక్షన్‌ని మానుషి రూపొందించింది. అధికారిక వెబ్‌సైట్ బికినీలు, మ్యాక్సీ డ్రెస్‌లు మరియు ప్యాంటు నుండి ట్రావెల్ ఎసెన్షియల్‌లు, కో-ఆర్డ్‌లు మరియు మరెన్నో అనేక ఉత్పత్తులను కలిగి ఉంది. ఇది అన్ని బీచ్ చిక్‌ల కోసం మీ వన్-స్టాప్ గమ్యస్థానం కావచ్చు. ప్రస్తుతం, వెబ్‌సైట్ 27 ఉత్పత్తులను చూపుతుంది, దీని ధర రూ.1,099 నుండి రూ.19,999 వరకు ఉంటుంది. మరొక పోస్ట్‌లో, మానుషి చిల్లర్ తన బ్రాండ్ నుండి మండుతున్న ఎరుపు రంగు బికినీ సెట్‌ను రాక్ చేస్తున్నట్లు మేము గుర్తించాము. ఆక్వా స్కల్ప్ట్ బికినీ టాప్ హాల్టర్ నెక్‌లైన్‌ను కలిగి ఉంది, ఇది లుక్‌కు ఓంఫ్ ఎలిమెంట్‌ను ఖచ్చితంగా జోడించింది. బ్యాక్‌లెస్ నంబర్ ఆమె మెడ వెనుక టై-అప్ వివరాలతో వచ్చింది, మరొక పట్టీ కట్టుతో జతచేయబడింది. మానుషి బికినీ టాప్‌తో మ్యాచింగ్ కోవ్ డబుల్ లేయర్ టై బికినీ బాటమ్స్‌తో జతకట్టింది మరియు ఒక చేతిలో కొన్ని చంకీ గోల్డ్ బ్రాస్‌లెట్‌లతో తన రూపాన్ని ముద్రించింది. మానుషి చిల్లర్ వాటర్ బేబీ అన్నది రహస్యం కాదు. ఇంతకుముందు, మానుషి తన ఫోటోషూట్‌లలో ఒకదాని కోసం ప్రకాశవంతమైన నారింజ రంగు రెండు ముక్కలను ఎంచుకుంది. ఆమె మాకు నోట్స్ తీసుకోమని ఒత్తిడి చేసిందని చెప్పనవసరం లేదు. చదరపు నెక్‌లైన్‌తో, బికినీ టాప్ విశాలమైన పట్టీలు మరియు ఎత్తైన నడుము బాటమ్‌లతో వచ్చింది. నటి తన రూపాన్ని పూర్తి చేయడానికి గోల్డెన్ హూప్స్ మరియు మ్యాచింగ్ స్టేట్‌మెంట్ చోకర్‌ను ఎంచుకుంది. మానుషి చిల్లర్ యొక్క కొత్త స్విమ్‌వేర్ సేకరణ వేసవికి చాలా బాగుంది.













# రెండో ఏటా వేతన ప్యాకేజీ తగ్గించుకున్న రిషాద్ ప్రేమ్‌జీ..



దేశీయ ఐటీ రంగం వృద్ధిరేటు నెమ్మదిస్తోంది. ఫలితంగా ఆయా కంపెనీలు తమ వృద్ధిరేటు గైడెన్స్ కుదించేస్తున్నాయి. ఈ తరుణంలో దేశీయ ఐటీ దిగ్గజ సంస్థల్లో ఒక్కటైన విప్రో ఎగ్జిక్యూటివ్ చైర్మన్ రిషాద్ ప్రేమ్‌జీ 2023-24 ఆర్థిక సంవత్సరంలో తన వార్షిక వేతనం తగ్గించేసుకున్నారు. రిషాద్ ప్రేమ్‌జీ వార్షిక వేతనం తగ్గించుకోవడం వరుసగా ఇది రెండో ఏడాది. ఇంతకుమందు 2022-23లోనూ తన వార్షిక వేతనాన్ని ఆయన తగ్గించుకున్నారు. కంపెనీ కన్సాలిడేటెడ్ ఆర్థిక ఫలితాల్లో నికర లాభాలు నెగెటివ్‌గా ఉన్నందున రిషాద్ ప్రేమ్‌జీ తన వేతన ప్యాకేజీ తగ్గించుకున్నారని యూఎస్ సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ కమిషన్‌లో ఇటీవల 20-ఎఫ్ ఫైల్ చేసింది విప్రో. రిషాద్ ప్రేమ్‌జీ గత ఆర్థిక సంవత్సరం (2023-24)లో వార్షిక వేతనం (కాంపన్‌సేసన్ ప్యాకేజీతోపాటు) లో దాదాపు 20 శాతం కోత విధించుకున్నారు. 2023-24లో సుమారు రూ.6.5 కోట్లు (7,69,456 యూఎస్ డాలర్లు) వేతనం తగ్గించుకున్నారు. అంతకుముందు 2022-23లో దాదాపు రూ.7.9 కోట్లు (9,51,353 యూఎస్ డాలర్లు) వేతనంలో కోత విధించుకున్నారు. దీంతో దీర్ఘకాలిక పరిహారంతోపాటు 2022-23తో పోలిస్తే 2023-24 ఆర్థిక సంవత్సరంలో రిషాద్ ప్రేమ్‌జీ వార్షిక వేతనం రూ.7.2 కోట్ల (8,61,000 యూఎస్ డాలర్లు) నుంచి రూ.5.8 కోట్ల (6,92,641 యూఎస్ డాలర్లు)కు పడిపోయింది. విప్రో కన్సాలిడెట్ నికర లాభంలో 0.35 శాతం కమిషన్‌ను రిషాద్ ప్రేమ్‌జీకి విప్రో చెల్లించాల్సి ఉంటుంది. కానీ గత ఆర్థిక సంవత్సరంలో ప్రతికూల నికర లాభాలు నమోదైనందున రిషాద్ అజీం ప్రేమ్‌జీకి ఎటువంటి కమిషన్ చెల్లించడం లేదని విప్రో తన ఫైలింగ్‌లో తెలిపింది. ఈ ఏడాది రిషాద్ ప్రేమ్‌జీకి ఎటువంటి స్టాక్ ఆప్షన్లు గ్రాంట్ కాలేదు. 2019లో ఐదేండ్ల పదవీ కాలానికి విప్రో చైర్మన్‌గా రిషాద్ ప్రేమ్‌జీ నియమితులయ్యారు. తాజాగా మరో ఐదేండ్లు అంటే 2029 జూలై 30 వరకూ ఆయన్ను చైర్మన్‌గా నియమిస్తూ కంపెనీ నిర్ణయం తీసుకున్నది. 2021-22లో రిషాద్ ప్రేమ్‌జీ అతి తక్కువగా 43.34 శాతం రెమ్యూనరేషన్ తీసుకుంటే, కంపెనీ మాజీ సీఈఓ కం ఎండీ థెర్రీ డెలాపోర్టే రెమ్యూనరేషన్ 3.26 శాతం పెరిగింది. ఐటీ రంగంలోనే అత్యధికంగా వేతనం అందుకున్న సీఈఓగా థెర్రీ డెలాపోర్టే రికార్డు సృష్టించారు.


# భారీగా పడిపోయిన బంగారం, వెండి..!




బంగారం, వెండి ధరలు భారీ స్థాయిలో పడిపోయాయి. బంగారం వెయ్యి, వెండి రూ.3000 వరకు తగ్గింది. అంతర్జాతీయ స్థాయిలో బంగారం స్పాట్ గోల్డ్ ఔన్స్ కు 30.40 డాలర్ల వద్ద కొనసాగుతోంది. స్పాట్ సిల్వర్ ఔన్స్ 33 డాలర్లకు చేరింది. ఈ నేపథ్యంలో దేశీయంగా బంగారం, వెండి ధరలు ఎలా ఉన్నాయో చూద్దాం..బులియన్ మార్కెట్ ప్రకారం.. మే24న ఓవరాల్ గా 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.67,300గా నమోదైంది.

24 క్యారెట్ల పసిడి 10 గ్రాములకు రూ.73,420 గా ఉంది. మే 23న 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం రూ.69,290తో విక్రయించారు. 10 గ్రాముల బంగారానికి గురువారంతో పోలిస్తే శుక్రవారం రూ.1000 తగ్గింది. దేశంలోని ప్రధాన నగరాల్లో బంగారం ధరలు ఎలా ఉన్నాయో చూద్దాం.. న్యూఢిల్లీలో 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.67,440 ఉండగా.. 24 క్యారెట్ల గోల్డ్ రూ.73,560గా నమోదైంది. ఆర్థిక రాజధాని ముంబైలో 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం రూ.67,290 కొనసాగుతోంది. 24 క్యారెట్లు రూ.73,400 పలుకుతోంది. చెన్నైలో 22 క్యారెట్ల బంగారం 10 గ్రాములకు రూ.67,490 పలుకుతోంది. 24 క్యారెట్ల 10 గ్రాములకు రూ.73,630తో విక్రయిస్తున్నారు. బెంగుళూరులో 22 క్యారెట్ల బంగారం 10 గ్రాములకు రూ.67,290 పలుకుతోంది. 24 క్యారెట్ల 10 గ్రాములకు రూ.73,410తో విక్రయిస్తున్నారు. హైదరాబాద్ లో 22 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ.67,290తో విక్రయిస్తున్నారు. 24 క్యారెట్ల 10 గ్రాములకు రూ.73,410తో విక్రయిస్తున్నారు. బంగారంతో పాటు వెండి ధరలు భారీగా తగ్గాయి. శుక్రవారం ఓవరాల్ గా కిలో వెండి రూ.92,400గా నమోదైంది.


# ఐటీసీ నికర లాభం రూ.5,190 కోట్లు...



ఈ ఏడాది మార్చి క్వార్టర్ (క్యూ4) లో ప్రాఫిట్ కొద్దిగా తగ్గిందని ఐటీసీ ప్రకటించింది. కిందటేడాది మార్చి క్వార్టర్‌లో రూ.5,242.59 కోట్ల నికర లాభాన్ని (కన్సాలిడేటెడ్) సాధించిన కంపెనీకి క్యూ4 లో రూ.5,190.71 కోట్లు వచ్చాయి. రెవెన్యూ రూ.19,058.29 కోట్ల నుంచి రూ.19,446.49 కోట్లకు పెరిగింది. ఐటీసీ మొత్తం ఖర్చులు ఏడాది ప్రాతిపదికన 3 శాతం పెరిగి రూ.13,294.30 కోట్లకు చేరుకున్నాయి. కంపెనీ మొత్తం ఆదాయం క్యూ4 లో రూ.20,130.32 కోట్లుగా ఉంది. ఒక్కో షేరుకి రూ.7.50 ఫైనల్ డివిడెండ్ ఇవ్వాలని ఐటీసీ బోర్డ్ నిర్ణయించింది. 2023-24 ఆర్థిక సంవత్సరానికిగాను ఇప్పటికే ఒక్కో షేరుకి రూ.6.25 ఇంటెరిమ్ డివిడెండ్‌ను కంపెనీ ఇచ్చింది. తాజాగా ప్రకటించిన డివిడెండ్‌ను కలుపుకుంటే కిందటి ఆర్థిక సంవత్సరానికి గాను ఒక్కో షేరుకి రూ.13.75 డివిడెండ్ ఇచ్చినట్టు. ఐటీసీ షేర్లు గురువారం 0.80 శాతం పెరిగి రూ.443.25 దగ్గర క్లోజయ్యాయి. హెూటల్స్ బిజినెస్‌ను సపరేట్ చేయడంపై వచ్చే నెల 6 న షేర్ హెూల్డర్ల మీటింగ్ పెట్టుకోవడానికి ఐటీసీకి ఎన్‌సీఎల్‌టీ అనుమతి ఇచ్చింది. కంపెనీ ఇప్పటికే స్టాక్ ఎక్స్ఛేంజ్‌ల నుంచి అనుమతులు పొందింది. హెూటల్స్ బిజినెస్‌ను డీమెర్జ్ చేయడానికి, వీటి షేర్లు మార్కెట్‌లో లిస్ట్ చేయడానికి కిందటేడాది ఆగస్టులో ఐటీసీ బోర్డ్ ఆమోదం తెలిపింది.

# ఒక్కసారి డిపాజిట్‌తో ఏడాదికి 60 వేల పెన్షన్..

## ఆ ఎల్ఐసీ పథకంతోనే సాధ్యం



ప్రస్తుత రోజుల్లో పెరుగుతున్న ఖర్చులతో పాటు అవసరాలు చూస్తుంటే ప్రజల్లో కొత్త భయాన్ని సృష్టిస్తున్నాయి. ముఖ్యంగా రిటైర్‌మెంట్‌కు దగ్గరగా ఉన్న వారైతే మరింత ఆందోళన చెందుతున్నారు. రిటైర్‌మెంట్ బెనిఫిట్ సొమ్ము ఒకేసారి చేతికి వచ్చినా నెలవారీ ఖర్చులు ఎలా? అనే విషయాన్ని ఆలోచిస్తున్నారు. అయితే ఇలాంటి వారిని పెట్టుబడి వైపు ప్రోత్సహించి నెలవారీ రాబడినిచ్చే వివిధ పథకాలు అత్యంత ప్రజాదరణ పొందుతున్నాయి. తాజాగా ప్రముఖ బీమా రంగ సంస్థ అయిన ఎల్ఐసీ అలాంటి పథకాన్ని లాంచ్ చేసింది. లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎల్ఐసీ) కొత్త పెన్షన్ స్కీమ్ సరళ్ పెన్షన్‌తో ముందుకు వచ్చింది. ఇందులో పాలసీదారుడు తన జీవితాంతం ఒకసారి ప్రీమియం చెల్లించడం ద్వారా పెన్షన్ పొందవచ్చు. ఈ నేపథ్యంలో ఎల్ఐసీ సరల్ పెన్షన్ స్కీమ్ గురించి వివరాలను తెలుసుకుందాం. ఎల్ఐసీ సరళ్ పెన్షన్ స్కీమ్‌ను పొందడానికి రెండు ఎంపికలు ఉన్నాయి. ఒకటి జీవితాంతం పెన్షన్ పొందేందుకు, మరొకటి చివరిగా జీవించి ఉన్న వ్యక్తి మరణించినప్పుడు కొనుగోలు చేసిన ధరపై 100 శాతం రిటర్న్‌తో ఉమ్మడి జీవిత వార్షికాదాయాన్ని పొందే ప్లాన్. మొదటి ఆప్షన్‌లో పాలసీదారు జీవించి ఉన్నంత వరకు యాన్యుటీ చెల్లింపులు బకాయిల్లోనే చేస్తారు. వ్యక్తి మరణించినప్పుడు, యాన్యుటీ చెల్లింపులు వెంటనే ఆగిపోతాయి. నామినీకి 100 శాతం మొత్తం చెల్లిస్తారు. రెండో ఎంపికలో వ్యక్తి లేదా అతని జీవిత భాగస్వామి జీవించి ఉన్నంత వరకు యాన్యుటీ మొత్తానికి సంబంధించిన బ్యాలెన్స్ చెల్లిస్తారు. జాయింట్ లైఫ్ యాన్యుటీని జీవిత భాగస్వామితో మాత్రమే తీసుకోవాల్సి ఉంటుంది. ఎల్ఐసీ సరళ్ పెన్షన్ స్కీమ్ పాలసీని కొనుగోలు చేయడానికి కనీస వయస్సు 40 సంవత్సరాలుగా ఉన్నా గరిష్ట వయస్సు 80 సంవత్సరాలుగా నిర్ణయించారు. సరళ్ పెన్షన్ కింద పొందే యాన్యుటీని భవిష్యత్తులో నెలవారీ, త్రైమాసికం లేదా వార్షికంగా చెల్లించవచ్చు. ఎల్ఐసీ తన పాలసీ డాక్యుమెంట్‌లో పాలసీ ప్రారంభంలో యాన్యుటీ రేట్లు హామీ ఇస్తుంది. ఎల్ఐసీ సరళ్ పెన్షన్ స్కీమ్‌ను పొందడానికి రెండు ఎంపికలు ఉన్నాయి. ఒకటి జీవితాంతం పెన్షన్ పొందేందుకు, మరొకటి చివరిగా జీవించి ఉన్న వ్యక్తి మరణించినప్పుడు కొనుగోలు చేసిన ధరపై 100 శాతం రిటర్న్‌తో ఉమ్మడి జీవిత వార్షికాదాయాన్ని పొందే ప్లాన్. మొదటి ఆప్షన్‌లో పాలసీదారు జీవించి ఉన్నంత వరకు యాన్యుటీ చెల్లింపులు బకాయిల్లోనే చేస్తారు.

# ఆర్‌బీఐ డివిడెండ్‌తో భారీ ర్యాలీ....!




బ్యాంకింగ్, ఆయిల్ ఆటో షేర్లలో కొనుగోళ్లకుతోడు, ప్రభుత్వానికి ఆర్?బీఐ రికార్డు స్థాయిలో డివిడెండ్ చెల్లించడంతో సెన్సెక్స్, నిఫ్టీలు గురువారం 1.6 శాతానికి పైగా ర్యాలీ చేసి జీవితకాల గరిష్ట స్థాయిలలో ముగిశాయి.

సెన్సెక్స్ ఈ ఏడాది జనవరి 29 తర్వాత 75 వేల స్థాయికి తిరిగొచ్చింది. ఈ ఇండెక్స్ గురువారం 1,196.98 పాయింట్లు దూసుకెళ్లింది. ఇది 1.61 శాతం పెరిగి 75,418.04 వద్ద ఆల్-టైమ్ గరిష్ట స్థాయి వద్ద ముగిసింది. ఇంట్రాడేలో 1,278.85 పాయింట్లు జూమ్ చేసి దాని ఆల్-టైమ్ ఇంట్రా-డే గరిష్ట స్థాయి 75,499.91కి చేరుకుంది. ఎన్ఎస్ఈ నిఫ్టీ ఇంట్రాడేలో రికార్డు స్థాయి 23,000 మార్క్‌కు చేరువైంది. ఇది 369.85 పాయింట్లు పెరిగి 22,967.65కి చేరుకుంది. ఇంట్రాడేలో 395.8 పాయింట్లు జంప్ చేసి 22,993.60 లెవెల్‌ను టచ్ చేసింది. దీంతో గురువారం ఇన్వెస్టర్ల సంపద 4.28 లక్షల కోట్లు పెరిగింది. సెన్సెక్స్ కంపెనీల్లో మహీంద్రా అండ్ మహీంద్రా, లార్సెన్ అండ్ టూబ్రో, యాక్సిస్ బ్యాంక్, మారుతీ, అల్ట్రాటెక్ సిమెంట్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, భారతి ఎయిర్‌టెల్, ఐసిఐసిఐ బ్యాంక్, టైటాన్, టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్, రిలయన్స్ ఇండస్ట్రీస్ లాభపడ్డాయి. సన్‌ఫార్మా, పవర్‌గ్రిడ్, ఎన్‌టీపీసీ వెనకబడ్డాయి. ఆర్‌బీఐ మార్చి 31తో ముగిసిన ఆర్థిక సంవత్సరానికి ప్రభుత్వానికి రికార్డు స్థాయిలో రూ. 2.1 లక్షల కోట్ల డివిడెండ్‌ను చెల్లించనుంది. ఇది బడ్జెట్ అంచనాల కంటే రెండింతలు ఎక్కువ.

# మార్కెట్‌లో పరుగులు పెడుతున్న యూజ్డ్ కార్లు...!



దేశంలోని ప్రీ-ఓన్డ్ కార్ల (యూజ్డ్ కార్ల) విక్రయ మార్కెట్ 2027-28 ఆర్థిక సంవత్సరం నాటికి 1.09 కోట్ల యూనిట్లకు చేరవచ్చని ఇండియన్ బ్లూ బుక్ (ఐబీబీ) తాజా నివేదిక ఒకటి అంచనా వేసింది. దీని విలువ 73 బిలియన్ డాలర్లుగా ఉండగా, ప్రస్తుత విలువతో పోల్చితే రెట్టింపునకుపైనే కావడం గమనార్హం. 2022-23 ఆర్థిక సంవత్సరంలో దేశీయంగా యూజ్డ్ కార్ల అమ్మకాలు దాదాపు 51 లక్షల యూనిట్లుగా ఉన్నాయి. వీటి విలువ 32.44 బిలియన్ డాలర్లుగా ఉన్నది. 'వ్యక్తిగత వాహనాలకు పెరుగుతున్న ప్రాధాన్యతేగాక, పెరిగిన ఆదాయాలు, స్వల్పకాలంలోనే వాహనాల మార్పు వంటి అంశాలూ.. ప్రీ-ఓన్డ్ కార్ల డిమాండ్‌ను పెంచేస్తున్నది' అని ఐబీబీ రిపోర్టు చెప్తున్నది. అలాగే కరోనా తర్వాత చాలామంది వ్యక్తిగత వాహనాల వైపు చూస్తున్నారని, దీంతో యూజ్డ్ కార్లకు డిమాండ్ పెరిగిందని పేర్కొన్నది. ఈ క్రమంలోనే 2026-27 ఆర్థిక సంవత్సరం నాటికి 80 లక్షల యూనిట్లకు యూజ్డ్ కార్ల మార్కెట్ చేరవచ్చన్నది. కొత్త కార్ల ధరలతో పోల్చితే 15-25 శాతం ధరల్లోనే యూజ్డ్ కార్లు అందుబాటులో ఉంటుండటం ఇప్పుడు ఈ మార్కెట్‌ను పరుగులు పెట్టిస్తున్నది. ఏదైనా కంపెనీకి చెందిన ఓ మాడల్ కొత్త కారు ధర రూ.10 లక్షలుగా ఉంటే.. అదే మాడల్ పాత కారు ధర రూ.2 లక్షలుగానే ఉండటం.. కస్టమర్లను ఈ వైపు చూసేలా చేస్తున్నదని మార్కెట్ వర్గాలు ట్రెండ్‌ను విశ్లేషిస్తున్నాయి. కండీషన్‌లో ఉండి, తక్కువ కిలోమీటర్లు తిరిగి, అప్‌గ్రేడ్ వెర్షనైతే మరో రూ.50,000ల నుంచి లక్ష రూపాయలు ఎక్కువగా పెట్టుకోవాల్సి వస్తుందని చెప్తున్నారు. దీంతో అన్నివిధాలా సరిపోయే కారు రూ.2.5 లక్షలు-3 లక్షల్లో వచ్చేస్తున్నది. ఇక ఇప్పటికే కార్లున్నవారు అప్‌గ్రేడ్ వెర్షన్‌లోకి మారడం కూడా యూజ్డ్ కార్ల మార్కెట్‌లోకి పెద్ద ఎత్తున వాహనాలు వచ్చేలా చేస్తున్నది. దీని విలువ 73 బిలియన్ డాలర్లుగా ఉండగా, ప్రస్తుత విలువతో పోల్చితే రెట్టింపునకుపైనే కావడం గమనార్హం. 2022-23 ఆర్థిక సంవత్సరంలో దేశీయంగా యూజ్డ్ కార్ల అమ్మకాలు దాదాపు 51 లక్షల యూనిట్లుగా ఉన్నాయి. వీటి విలువ 32.44 బిలియన్ డాలర్లుగా ఉన్నది. 'వ్యక్తిగత వాహనాలకు పెరుగుతున్న ప్రాధాన్యతేగాక, పెరిగిన ఆదాయాలు, స్వల్పకాలంలోనే వాహనాల మార్పు వంటి అంశాలూ.. ప్రీ-ఓన్డ్ కార్ల డిమాండ్‌ను పెంచేస్తున్నది' అని ఐబీబీ రిపోర్టు చెప్తున్నది.

# విద్యుత్ వ్యాగన్ ఆర్ వచ్చేస్తోంది.. ఇప్పటికే మోడల్ ప్రదర్శన..



జపాన్‌కు చెందిన వాహనాల తయారీ దిగ్గజం జుసుకీ ఈడబ్ల్యూఎక్స్ పేరుతో కారు కోసం పేటెంట్ దాఖలు చేసినట్లు ప్రచారం జరుగుతోంది. భారత్‌లో మారుతి సుజుకీ వ్యాగన్ ఆర్‌కు ఇది విద్యుత వర్షన్‌గా ఊహాగానాలు వినిపిస్తున్నాయి. 20వవాహన ప్రదర్శనలో జుజుకీ ఇడబ్ల్యూఎక్స్ మోడల్‌ను మొదటిసారి ప్రదర్శించింది. ఇది చూడడానికి వ్యాగర్ ఆర్ డిజైన్‌ను పోలి ఉంది. ముందువైపు సీ ఆకృతి లైట్ క్లస్టర్‌లు, ప్లాస్టిక్ క్లాడింగ్ కలిఇన బంపర్, చక్రాలు, పక్కన పసుపు షేడ్స్ ఉంటాయి. ఒకసారి చార్జింగ్‌తో ఇడబ్ల్యూఎక్స్ 230 కిలోమీటర్లు ప్రయాణిస్తుందని సుజుకీ ఇంతకు ముందే ప్రకటించింది. ఇడబ్ల్యూఎక్స్ మోడల్ కారును భారత్‌లో ఈవీగా లాంచ్ చేస్తారని ప్రచారం జరగుతోంది. అయితే దీనిపై సుజుకీ ఇప్పటి వరకు ఎలాంటి స్పష్టత ఇవ్వలేదు. ప్రస్తుతం భారత్‌లో హైబ్రిడ్ వాహనాన్ని తీసుకొచ్చేందుకు మారుతీ సన్నాహాలు చేస్తోంది. 2025లో నెక్సా ఛానెల్ ద్వారా మొదటి విద్యుత్ కారు ఈవీఎక్స్‌ను తీసుకొచ్చే అవకాశం ఉంది. దీనిని ఒకసారి చార్జింగ్ పెడితే 550 కిలోమీటర్ల మైలేజీ వస్తుందని సమాచారం. ఇదిలా ఉండగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో అమ్మకాల్లో రెండంకెల వృద్ధి ఆశిస్తున్నట్లు మెర్సిడెస్ బెంజ్ ఇండియా ప్రకటించింది హై ఎండ్ మోడళ్లకు అధిక గిరాకి ఉందని కంపెనీ వైస్ ప్రెసిడెంట్ లాన్స్ బెనెట్ తెలిపారు.

# బిజెపియే గెలుస్తుంది



న్యూఢిల్లీ: ఇటీవల ప్రశాంత్ కిశోర్, తర్వాత ఇయాన్ బ్రెమ్మర్ బిజెపి గెలుస్తుందని చెప్పాక ఇప్పుడు స్వరాజ్ ఇండియా నాయకుడు యోగేంద్ర యాదవ్ కూడా బిజెపియే గెలుస్తుందని విలేకరుల సమావేశంలో తెలిపారు. ప్రస్తుత లోక్ సభ ఎన్నికల్లో కాంగ్రెస్ ట్యాలీ 100 మార్కును టచ్ చేయొచ్చని కూడా ఆయన అన్నారు. కాగా బిజెపి 240 నుంచి 260 సీట్లను, దాని మిత్రపక్షాలు 34 నుంచి 45 సీట్లను గెలుచుకుంటాయని కూడా తెలిపారు. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలంటే 272 సీట్లు కావలసి ఉంటుంది. కాగా బిజెపి/ఎన్ డిఏ ప్రస్తుతం 303/323 సీట్లు ఉన్నాయి. 18 సీట్లు గెలిచిన శివసేన ఇప్పుడు ఎన్ డిఏలో లేదు. జూన్ 4న ఎవరికి ఎన్ని అనేది తేలిపోతుంది అని ప్రశాంత్ కిశోర్ ఎక్స్ లో (ఇదివరకటి ట్విట్టర్)లో పేర్కొన్నారు. బిజెపి పట్ల వ్యతిరేకత పెద్దగా లేదు కనుక బిజెపియే మెజారిటీ సాధిస్తుందని ప్రశాంత్ కిశోర్ ఇటీవల ఓ ఇంటర్వ్యూలో తెలిపారు. ఇదిలా ఉండగా ఇయాన్ బ్రెమర్ అనే అమెరికా రాజకీయ శాస్త్రజ్ఞుడు ఓ ఛానెల్ లో బిజెపి 295 నుంచి 315 సీట్లను గెలుచుకుంటుందన్నారు. బిజెపి ఈసారి తమిళనాడు, కేరళ, పశ్చిమ బెంగాల్, తెలంగాణలో కూడా సీట్లను పెంచుకోబోతోందని వినికిడి. 2019 సార్వత్రిక ఎన్నికలో కాంగ్రెస్ కేవలం 52 సీట్లే గెలిచింది.

# ఇండియా బ్లాక్ గెలుస్తుంది: ప్రియాంక గాంధీ



న్యూఢిల్లీ: దేశంలో పెరుగుతున్న ధరలు, నిరుద్యోగం పెద్ద సమస్యలుగా ఉన్నాయని కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక గాంధీ అన్నారు. ప్రస్తుత లోక్ సభ ఎన్నికల్లో ఇండియా బ్లాక్ గెలుస్తుందని అన్నారు. పరిస్థితులు ఇండియా కూటమికి అనుకూలంగా ఉన్నాయన్నారు. నేటి ఉదయం ప్రియాంక గాంధీ తన ఓటును వినియోగించుకున్నప్పుడు ఈ విషయాలు తెలిపారు. కాంగ్రెస్ నాయకులు ఆమ్ ఆద్మీ పార్టీకి, అలాగే ఆమ్ ఆద్మీ పార్టీ వారు కాంగ్రెస్ కు ఓటేయడంపై మాట్లాడుతూ " మా మధ్య భేదాలను మేము పక్కకు పెట్టేశాం. రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని రక్షించేందుకు ఒకొరికొకరం సహకరిస్తూ ఓటేకుంటున్నాం. అందుకు నేను గర్విస్తున్నాను" అన్నారు. " బిజెపి నాయకులు ధరల పెరుగుదల, నిరుద్యోగ సమస్య తప్ప అన్ని విషయాలపై మాట్లాడుతున్నారు. దీనికి ప్రజలు విసిగిపోయారు" అని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ అన్నారు. ప్రియాంక గాంధీతో పాటు ఆమె భర్త రాబర్ట్ వాద్రా, వారి కూతురు మిరయా వాద్రా, కుమారుడు రైహాన్ వాద్రా కూడా తమ ఓటు వినియోగించుకున్నారు. తొలిసారి ఓటు వినియోగించుకుంటున్న మిరయా వాద్రా "ప్రజలు ముందుకొచ్చి ఓటేయాలన్నది నా సందేశం" అన్నారు.

# ఐదు దశల సంపూర్ణ పోలింగ్ వివరాలు వెల్లడి..
# డేటాను మార్చడం అసాధ్యమన్న ఈసీ



న్యూఢిల్లీ: పోలింగ్ డేటాను మార్చడం అసాధ్యమని ఎన్నికల సంఘం (ఈసీ) స్పష్టం చేసింది. పోలింగ్ శాతాలపై తప్పుడు కథనాలు రూపొందిస్తున్నారని ఆరోపించింది. లోక్‌సభ ఎన్నికల ఐదు దశలకు సంబంధించిన సంపూర్ణ పోలింగ్ వివరాలు, ఓటు వేసిన వారి పూర్తి శాతాలను శనివారం విడుదల చేసింది. పోలింగ్ ముగిసిన 48 గంటల్లోపు ప్రతి బూత్‌లో పోలైన, తిరస్కరించిన ఓట్లతో సహా పోలింగ్ డేటాను విడుదల చేయాలని కోరుతూ సుప్రీంకోర్టులో శుక్రవారం పిటిషన్లు దాఖలయ్యాయి. ప్రతి దశ పోలింగ్ తర్వాత డేటాను సంకలనం చేసి వెబ్‌సైట్‌లో ప్రచురించేలా ఈసీని ఆదేశించాలని ఆ పిటిషన్లలో కోరారు. ఈ పిటిషన్లపై విచారణను సుప్రీంకోర్టు వాయిదా వేసింది.
కాగా, పోలింగ్ ముగిసిన తర్వాత ఓటింగ్ శాతాలు పెరుగుతున్నట్లు వస్తున్న ఆరోపణలపై ఈసీ స్పందించింది. ఎన్నికల ప్రక్రియను దెబ్బతీసేందుకు ఇలాంటి తప్పుడు కథనాలు ప్రచారం చేస్తున్నారని ఆరోపించింది. సుప్రీంకోర్టు పరిశీలనలు, తీర్పుతో ఓటింగ్ శాతం డేటా విడుదల ప్రక్రియ మరింత బలపడుతుందని పేర్కొంది. అయితే డేటా విడుదల కసరత్తు మొత్తం కూడా ఎలాంటి తేడా లేకుండా కచ్చితమైన, స్థిరమైన, ఎన్నికల చట్టాలకు అనుగుణంగా జరుగుతుందని ఈసీ తెలిపింది. ఎన్నికల ప్రజాస్వామ్యం కోసం నిరాటంకంగా సేవ చేయాల్సిన ఉన్నతమైన బాధ్యత కమిషన్‌పై ఉందని గుర్తు చేసింది.
మరోవైపు ఏప్రిల్ 19 నుంచి ముగిసిన ఐదు దశల సంపూర్ణ పోలింగ్ వివరాలను ఈసీ శనివారం విడుదల చేసింది. ప్రతి దశలో పోలింగ్ రోజున ఉదయం 9.30 గంటల నుంచి 'ఓటర్ టర్నింగ్ యాప్' లో డేటా ఎల్లప్పుడూ 24ఐ7 అందుబాటులో ఉంటుందని తెలిపింది. ప్రతి దశలో సాయత్రం 5.30 గంటల వరకు ప్రతి రెండు గంటలకు ఒకసారి కొత్త పోలింగ్ శాతాలను పేర్కొంటామని చెప్పింది.
కాగా, ప్రతి దశ పోలింగ్ అనంతరం సాయంత్రం 7 గంటల తర్వాత నుంచి డేటాను నిరంతరం అప్‌డేట్ చేస్తామని ఈసీ తెలిపింది. పోలింగ్ రోజు అర్ధరాత్రి నాటికి, ఓటరు సంఖ్య యాప్ ద్వారా 'క్లోజ్ ఆఫ్ పోల్' డేటా శాతాన్ని ఉత్తమంగా అంచనా వేయవచ్చని వెల్లడించింది. పోలింగ్ ప్రాంతాల్లోని భూగోళ, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పోలింగ్ సిబ్బంది తిరిగి చేరిన తర్వాత సంపూర్ణ పోలింగ్ శాతాలు, రీ పోలింగ్ అవసరం గురించి పూర్తి స్పష్టత వస్తుందని వివరించింది.

## గన్ పౌడర్ కంపెనీలో పేలుడు: 17 మంది మృతి





రాయ్‌పూర్: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బెమెతారా ప్రాంతంలో గన్ పౌడర్ కంపెనీలో శనివారం ఉదయం భారీ పేలుడు సంభవించింది. బెర్లా బ్లాక్ లోని బోర్సి గ్రామ శివారులో గన్ పౌడర్ కంపెనీలో పేలుడు సంభవించడంతో 17 మంది మృతి చెందారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిని రాయ్‌పూర్ లోని ఎయిమ్స్ ఆస్పత్రికి తరలించారు. ఎస్‌డిఆర్‌ఎఫ్ బృందాలు అక్కడి చేరుకొని శిథిలాల కింద చిక్కుకున్న వారిని బయటకు తీస్తున్నారు.

# ఆరో దశలోనూ బెంగాల్‌లో హింసాత్మక ఘటనలు.. టీఎంసీ, బీజేపీ మధ్య ఘర్షణలు




కోల్‌కతా: లోక్‌సభ ఎన్నికల ఆరో దశ పోలింగ్‌లో కూడా పశ్చిమ బెంగాల్‌లో హింసాత్మక సంఘటనలు జరిగాయి. టీఎంసీ, బీజేపీ మధ్య ఘర్షణలు కొనసాగాయి. బీజేపీ అభ్యర్థితోపాటు పలువురు సెక్యూరిటీ సిబ్బంది గాయపడ్డారు. జార్‌గ్రామ్‌లో బీజేపీ అభ్యర్థి ప్రణత్ టుడు కాన్వాయ్‌పై దాడి జరిగింది. గర్బెటాలోని పోలింగ్ బూత్ వద్ద ఓటర్లను బెదిరిస్తున్నట్లు ఆరోపణలు వచ్చాయి. దీంతో బీజేపీ అభ్యర్థి ప్రణత్ టుడు ఆ పోలింగ్ బూత్ సందర్శనకు వెళ్లారు. ఈ సందర్భంగా కొంత మంది వ్యక్తులు బీజేపీ అభ్యర్థిపై రాళ్లు రువ్వారు. వెంటనే స్పందించిన సెక్యూరిటీ సిబ్బంది ఆయనను అక్కడి నుంచి తీసుకెళ్లారు. ఈ ఘర్షణలో బీజేపీ అభ్యర్థి కారు కూడా ధ్వంసమైంది. అయితే గర్బెటాలోని పోలింగ్ బూత్ వెలుపల ఓటు వేయడానికి క్యూలో వేచి ఉన్న మహిళపై బీజేపీ అభ్యర్థి సెక్యూరిటీ సిబ్బంది దాడి చేసినట్లు టీఎంసీ ఆరోపించింది. మరోవైపు బెంగాల్‌లోని ఎనిమిది లోక్‌సభ నియోజకవర్గాల్లో హింసాత్మక సంఘటనలు జరిగాయి. ఘటల్, కంతిలో అధికార టీఎంసీ, బీజేపీ కార్యకర్తల మధ్య ఘర్షణ జరిగింది. ఘటల్‌లో టీఎంసీ గూండాలు ఓటింగ్ ప్రక్రియలో అడ్డంకులు సృష్టించినట్లు బీజేపీ అభ్యర్థి హిరాన్ ఛటర్జీ ఆరోపించారు.

## వాగులో కొట్టుకుపోయిన హైదరాబాద్ టూరిస్టులు..
# కాపాడిన కేరళ పోలీసులు



కొట్టాయం: గూగుల్ మ్యాప్స్‌ను నమ్ముకుని ప్రయాణిస్తున్న హైదరాబాద్‌కు చెందిన ఒక పర్యాటకుల బృందం వాగులో కొట్టుకుపోయింది. శుక్రవారం రాత్రి జరిగిన ఈ ఘటనలో బృందానికి చెందిన నలుగురు పర్యాటకులను కేరళ పోలీసులు కాపాడారు. దక్షిణ కేరళలోని కొట్టాయం జిల్లాలోని కురుప్పన్‌తరా సమీపంలో ఈ ఘటన జరిగింది. ఒక మహిళతోసహా నలుగురు సభ్యుల బృందం కారులో అలప్పుళ వెళుతోంది. భారీ వర్షం కారణంగా వాగు పొంగి నీరు రోడ్డుపై ప్రవహిస్తుండడంతో వారు ప్రవాహంలోనుంచే ముందుకు సాగారు. అయితే ఆ ప్రాంతంతో వారికి పరిచయం లేకపోవడంతో గూగుల్ మ్యాప్స్ ఆధారంగా ముందుకు వెళ్లేందుకు ప్రయత్నించగా వారి కారు వాగులోకి వెళ్లిపోయింది. సమీపంలోనే ఉన్న గస్తీ పోలీసులు స్థానకుల సహాయంతో వారిని వాగులో కొట్టుకుపోతున్న వారిని రక్షించారు. అయితే వారి కారు మాత్రం వాగులో పూర్తిగా మునిగిపోయింది. కారును బయటకు తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తున్నామని కడుతురుతి పోలీసు స్టేషన్ అధికారి ఒకరు తెలిపారు. కేరళలో ఇటువంటి ఘటనలు జరగడం కొత్తేమీ కాదు. గత ఏడాది అక్టోబర్‌లో ఇద్దరు యువ డాక్టర్లు గూగుల్స్ మ్యాప్స్ ఆధారంగా కారు నడిపి నదిలో మునిగి మరణించారు. కాగా..వర్షాకాలంలో టెక్నాలజీని నమ్ముకుని ప్రయాణించవద్దని కేరళ పోలీసులు ప్రజలను హెచ్చరించారు.

# కర్ణాటకలో గ్యాంగ్ వార్.. కార్లతో ఘర్షణ, వ్యక్తులను ఢీకొట్టి బీభత్సం



బెంగళూరు: రెండు వర్గాల మధ్య గ్యాంగ్ వార్ జరిగింది. కార్లను వేగంగా నడిపి, వ్యక్తులను తొక్కించి హింసాత్మక ఘర్షణకు పాల్పడ్డారు. కార్ల నుంచి కిందకు దిగి దాడులు చేసుకుని బీభత్సం సృష్టించారు. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. కర్ణాటకలోని ఉడిపి జిల్లాలో ఈ సంఘటన జరిగింది. ఈ నెల 18న కుంజిబెట్టులోని ఉడిపి-మణిపాల్ జాతీయ రహదారిపై ఒక గ్యాంగ్‌లోని రెండు వర్గాల మధ్య హింసాత్మక ఘర్షణ జరిగింది. రెండు కార్లు ఒకదానికొకటి ఢీకొన్నాయి. ఆ తర్వాత కొంత మంది వ్యక్తులు కార్ల నుంచి బయటకు వచ్చారు. ప్రత్యర్థి ముఠా సభ్యులపై దాడులు చేశారు. ఈ ఘర్షణ సందర్భంగా రివర్స్‌లో వేగంగా వచ్చిన కారుతో ఒక వ్యక్తిని తొక్కారు. అలాగే మరికొందరిని కారుతో ఢీకొట్టారు. కాగా, కార్లతో బీభత్సం సృష్టించిన ఈ ఘర్షణపై పోలీసులు స్పందించారు. ఈ కేసులో ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేశారు. ఒక స్విఫ్ట్ కారు, రెండు ద్విచక్ర వాహనాలు, కత్తులు, ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు. పరారీలో ఉన్న ఇతర నిందితులను త్వరలో పట్టుకుంటామని పోలీస్ అధికారి తెలిపారు. మరోవైపు కార్లతో ఘర్షణకు సంబంధించిన వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.

## వేల కోట్లు దోచుకుని ఢిల్లీకి పంపిస్తున్నారు..
# కాంగ్రెస్ నాయకులపై బండి సంజయ్ ఫైర్



రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై కరీంనగర్ బీజేపీ ఎంపీ బండి సంజయ్ విరుచుకుపడ్డారు. రైస్ మిల్లర్లతో కాంగ్రెస్ నేతలు కుమ్మక్కయారని అన్నారు. వేల కోట్లు దోచుకుని ఢిల్లీకి పంపుతున్నారని ఆరోపించారు. నల్గొండ జిల్లా బీజేపీ కార్యాలయంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. పౌరసరఫరాల శాఖలో అతిపెద్ద కుంభకోణం జరిగిందని అన్నారు. రైస్ మిల్లర్లతో కాంగ్రెస్ నాయకులు కుమ్మక్కయ్యారని బండి సంజయ్ అన్నారు. ఉత్తమ్ కుమార్ రెడ్డిపై తనకు నమ్మకం ఉందని.. కానీ ఆయన కత్తి తీయడం లేదన్నారు. రైస్ మిల్లర్ల నుంచి ఏ నాయకుడికి ఎంత ముట్టిందో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఆ శాఖలో జరిగిన అక్రమాలు, అవినీతిపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలని అన్నారు. పౌరసరఫరాల శాఖ నష్టాల్లో ఎందుకు ఉందో చెప్పాలని ప్రశ్నించారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని పడగొట్టే ప్రయత్నాలు బీజేపీ చేయదని బండి సంజయ్ తెలిపారు. ప్రభుత్వాన్ని పడగొట్టే అవకాశాన్ని కాంగ్రెస్ నేతలు ఇంకొకరికి ఇవ్వరని ఎద్దేవా చేశారు. పార్లమెంటు ఎన్నికల ఫలితాల తర్వాత కాంగ్రెస్ నేతలు రోడ్లపై తిరిగే పరిస్థితి ఉండదని విమర్శించారు.

## పుణె కారు ఘటనలో టీనేజర్ తాత అరెస్ట్



పుణె: పుణెలోని పోర్షే కారు ఘటనలో తాజాగా నిందితుడి తాతను కూడా పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ నెల 28 వరకు అతడికి పోలీస్ కస్టడీ విధించారు. నిందితుడి స్థానంలో తన ఇంటి డ్రైవర్‌ను ఉంచడానికి అతడి తాత బెదిరింపులు, ప్రలోభాలతో ప్రయత్నించారని ఫిర్యాదులు వచ్చాయి.

Printed, Published and owned by **VISHWANATH V**, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301.
and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : **VISHWANATH V**, **RNI Regd. No. TELTEL/2023/86207**, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com